# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 2 సంచిక : 15 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు ఆదివారం 20 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :15 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE SUN 20 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# పేదల ఆనందం చూసి నా జీవితం ధన్యమైంది

## ప్రాణం ఉన్నంతవరకు ఈ క్షణాన్ని గుర్తుపెట్టుకుంటాను: విశాఖలో చంద్రబాబు ఎమోషనల్

- విశాఖలో 28,445 కుటుంబాలకు ఇళ్ల పట్టాల పంపిణీ
- మీ ఇంటిపై సర్వ హక్కులు మీవేనని సీఎం చంద్రబాబు భరోసా
- విశాఖను విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని భారీ ప్రకటన
- గోదావరి జలాలతో నగర నీటి కష్టాలు శాశ్వతంగా తీరుస్తామని హామీ
- గత ప్రభుత్వ పాలనలో భూ కబ్జాలు, కూల్చివేతలపై తీవ్ర విమర్శలు






పెన్ పవర్ డెస్క్:విశాఖ నగరంలోని వేలాది పేద కుటుంబాల దశాబ్దాల కల నెరవేరింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమం ద్వారా 28,445 కుటుంబాలకు వారు నివసిస్తున్న ఇళ్లపై సర్వ హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేశారు. శనివారం విశాఖలో జరిగిన సభలో ఆయన లబ్ధిదారులకు

- మిగతా 2లో



## సొంత నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన.. సోమవారం నుంచే!

- పిఠాపురంలో రూ. 1,500 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించనున్న పవన్ కళ్యాణ్
- రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- రూ. 200 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రూ. 80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్స్‌కు శ్రీకారం
- మహిళా సంఘాలకు రూ. 120 కోట్ల రుణాలు, మత్స్యకారులకు ఆధునిక పరికరాల పంపిణీ
- తాగునీటి పథకాలు, రోడ్ ఓవర్ బ్రిడ్జి వంటి కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన

పెన్ పవర్ డెస్క్:ఏపీ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ తన నియోజకవర్గ అభివృద్ధిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పిఠాపురాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో, సుమారు రూ. 1,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా సోమవారం నుంచి రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. పర్యటనలో భాగంగా

- మిగతా 2లో



## ఏపీ అమ్మాయిలు టీమిండియాలో ఆడాలి


- మంగళగిరిలో మహిళల ఏపీఎల్ ప్రారంభంపై మంత్రి లోకేశ్ హర్షం
- ఏపీ అమ్మాయిలు జాతీయ జట్టుకు ఆడాలన్నదే లక్ష్యమని వెల్లడి
- ట్రోఫీని ఆవిష్కరించిన నారా బ్రాహ్మణి, బ్రాండ్ అంబాసిడర్ మిథాలీ రాజ్
- వేదిక కల్పించిన ఏసీఏకు లోకేశ్ అభినందనలు
- ఏపీ నుంచి భవిష్యత్ ఛాంపియన్లు వస్తారని ఆశాభావం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ మహిళా క్రికెటర్లు జాతీయ జట్టులో స్థానం సంపాదించాలన్నదే తన ఆకాంక్ష అని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని మహిళా క్రికెటర్ల కలలను సాకారం చేసేందుకు తొలిసారిగా నిర్వహిస్తున్న మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూఏపీఎల్) ఒక బలమైన వేదిక అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం మంగళగిరిలో డబ్ల్యూఏపీఎల్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టోర్నమెంట్ ట్రోఫీని నారా బ్రహ్మణి, భారత మహిళా క్రికెట్ దిగ్గజం, టోర్నీ బ్రాండ్ అంబాసిడర్ మిథాలీరాజ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ టోర్నీ ప్రారంభంపై మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ తన

- మిగతా 2లో

## అండమాన్‌లో అల్పపీడనం.. మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండం

- ఉత్తర అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం
- వాయుగుండంగా బలపడి ఉత్తరాంధ్ర తీరం వైపు పయనం
- సోమవారం నుంచి కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురిసే అవకాశం
- తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరిక
- మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విపత్తుల నిర్వహణ సంస్థ సూచన




పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి వర్ష సూచన వెలువడింది. ఉత్తర అండమాన్, దాని పరిసర ప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ

- మిగతా 2లో

## కర్ణాటక పర్యటనలో అమిత్ షాకు అస్వస్థత

- హుబ్బళ్లి పర్యటనలో అస్వస్థతకు గురైన అమిత్ షా
- మెడికల్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి గైర్హాజరు
- వైద్యుల సూచన మేరకు హోటల్‌లోనే విశ్రాంతి
- ఆయన స్థానంలో పాల్గొన్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



పెన్ పవర్ డెస్క్:కర్ణాటక పర్యటనలో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో హుబ్బళ్లిలో ముందుగా నిర్ణయించిన కార్యక్రమానికి ఆయన హాజరు కాలేకపోయారు. వైద్యులు విశ్రాంతి తీసుకోవాలని సూచించడంతో ఆయన హోటల్‌కే పరిమితమయ్యారు. హుబ్బళ్లిలోని కేఎల్ఈ జగద్గురు గంగాధర్

- మిగతా 2లో



## భారత యువత సత్తాకు స్టార్టప్‌లే నిదర్శనం

- 20వ రోజ్‌గార్ మేళాలో 51,000 మందికి పైగా నియామక పత్రాల పంపిణీ
- భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరణ
- చిన్న నగరాల్లోనూ స్టార్టప్‌లు వస్తుండటం శుభపరిణామం అన్న ప్రధాని
- రూ. లక్ష కోట్లతో ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన ప్రారంభం
- కొత్తగా చేరిన ఉద్యోగులకు నిరంతర అభ్యాసంపై ప్రధాని మోదీ సూచన

- మిగతా 2లో



## తిరుమలలో వైభవంగా సాగిన గరుడ సేవ..

### రెండు లక్షల మంది భక్తులతో పోటెత్తిన మాఢవీధులు

- శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో విశిష్టమైనది గరుడ సేవ
- గరుడ వాహనంపై భక్తులను కటాక్షించిన మలయప్ప స్వామి
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో కిక్కిరిసిన మాడ వీధులు
- గోవింద నామస్మరణలతో మార్మోగిన తిరుమల కొండ
- భక్తుల కోసం టీటీడీ భారీ ఏర్పాట్లు, నిరంతర పర్యవేక్షణ

పెన్ పవర్ డెస్క్:తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలక ఘట్టమైన గరుడ వాహన సేవ శనివారం రాత్రి అంగరంగ వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. గరుత్మంతునిపై శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువైన శ్రీ మలయప్పస్వామి వారు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ

- మిగతా 2లో



## కరవులో రైతాంగం.. దోపిడీలో కూటమి ప్రభుత్వం

- తప్పుడు హామీలతో ప్రజలను నమ్మించి కూటమి అధికారంలోకి వచ్చిందంటూ పేర్ని నాని ధ్వజం
- సూపర్ సిక్స్ హామీలు ప్రకటనలకే పరిమితం అయ్యాయని విమర్శ
- ప్రజల నుంచి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరిక

- మిగతా 2లో

## ఇంటర్ బోర్డులో డిజిటలైజేషన్, రిటైర్మెంట్ వయోపరిమితి పెంపు

- లోకేశ్ నివాసంలో ఇంటర్ బోర్డు పాలకవర్గం సమావేశం
- 1978 నుంచి జారీ చేసిన ఇంటర్ సర్టిఫికెట్లను డిజిటలైజ్ చేయాలని నిర్ణయం
- ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 60 నుంచి 62కి పెంచాలని తీర్మానం



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యారంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా వైవిధ్యమైన సంస్కరణలకు తెరలేపారు. ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధ్యక్షతన జరిగిన ఇంటర్ బోర్డు 78వ పాలకవర్గ సమావేశంలో విద్యార్థుల భవిష్యత్తుతో పాటు ఉద్యోగుల సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకుంటూ

- మిగతా 2లో



## మానవత్వం చాటుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

పెన్ పవర్ డెస్క్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధి తులకు సాయమందించి కేంద్ర మంత్రి బండి సంజయ్ మానవత్వం చాటుకున్నారు. రాజీవ్ రహదారిలో ఓ కారు సిద్దిపేట నుంచి గజ్వేల్ వైపు వెళ్తుండగా డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టింది. భర్త డ్రైవింగ్ చేస్తుండగా.. భార్య ముందు సీట్లో, కుమార్తె వెనుక సీట్లో కూర్చున్నారు. ప్రమాద సమయంలో ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకోవడంతో దంపతులకు ప్రాణాపాయం తప్పింది. వెనుక సీట్లో ఉన్న కుమార్తె తల, ముక్కుకు తీవ్ర గాయాలయ్యాయి.

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### జగన్ నిర్ణయం మార్చుకున్నారా?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ రాజీపడుతున్నారా? తన నైజాన్ని పక్కన పెట్టి వచ్చే ఎన్నికల్లో విజయం కోసం నిర్ణయాలను మార్చుకోవాలని భావిస్తున్నారా? అంటే నిజమేనని అంటున్నారు. వైసీపీ నుంచి వీడిన నేతలను తిరిగి చేర్చుకునేందుకు జగన్ సిద్ధమవుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. వైసీపీ నుంచి వీడిన కొందరు కీలక నేతలను తిరిగి పార్టీలోకి చేర్చుకునేందుకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సానుకూలంగా ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. 2024 ఎన్నికల్లో పార్టీ ఓటమి తర్వాత పలువురు సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడిన సంగతి తెలిసిందే. అయితే ప్రస్తుత మారుతున్న సమీకరణాల నేపథ్యంలో, వీరిలో కొందరు నాయకులు తిరిగి పార్టీలోకి రావడానికి ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది.

**రీ-ఎంట్రీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నారా?**

పార్టీ వీడిన కొందరు కీలక స్థానిక నాయకులను, మాజీ మంత్రులను తిరిగి చేర్చుకోవడం ద్వారా క్యాడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపవచ్చని వైఎస్ జగన్ భావిస్తున్నట్లు రాజకీయ విశ్లేషణలు చెబుతున్నాయి. గతంలో వ్యతిరేకించినప్పటికీ, మారుతున్న పరిస్థితుల్లో కొందరు మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు మళ్లీ జగన్ వైపు మొగ్గు చూపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేయడంపై అధినేత ప్రత్యేక దృష్టి పెట్టారు. గతంలో భీమవరం నుంచి గెలిచిన గ్రంధి శ్రీనివాస్ లాంటి నేతల రీ-ఎంట్రీ గురించిన చర్చలు పార్టీ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ఇతర పార్టీలోకి వెళ్లిన నేతలు అక్కడ సంతృప్తికరంగా లేకపోవడం, తగిన ప్రాధాన్యత లేకపోవడంతో తిరిగి ఫ్యాన్ గూటికి చేరడంపై కొందరు ముఖ్య వైసీపీ నేతలతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం అందుతుంది. అయితే ఇందులో ఎవరు వస్తారు? ఎవరిని తిరిగి పార్టీలోకి తీసుకోవాలి? అన్న విషయంపై జగన్ ఇంకా నిర్ణయం తీసుకోలేదని సమాచారం.

**పార్టీని బలోపేతం చేసే వ్యూహమే...**

ఇతర పార్టీల నుంచి లేదా సొంత గూటికి తిరిగి వచ్చే నేతల వల్ల పార్టీకి మైలేజీ పెరిగి, స్థానికంగా బలం చేకూరుతుందనుకుంటే ఖచ్చితంగా తలుపులు తెరిచే ఉంచాలనే సంకేతాలు పార్టీ అంతర్గత సమావేశాల్లో వ్యక్తమయ్యాయి. ఒకవైపు పార్టీ వీడుతున్న నేతలను ఆపుతూనే, మరోవైపు పోయిన వైభవాన్ని తిరిగి తెచ్చుకునేందుకు, స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసేందుకు జగన్ తన వ్యూహాలకు పదును పెడుతున్నారు. అయితే, ఇప్పటివరకు ఈ నాయకుల రీ-ఎంట్రీలపై పార్టీ పరంగా ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ, కొందరు మాజీ నేతలు మాత్రం వైఎస్ జగన్‌తో టచ్‌లోకి వెళ్లినట్లు గట్టిగా ప్రచారం సాగుతోంది. అయితే పార్టీ క్లిష్ట సమయంలో వీడిన నేతలను తిరిగి చేర్చుకోవడంపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అలా చేర్చుకున్నందువల్ల పార్టీ పట్ల నిబద్ధత, అంకిత భావం కొరవడుతుందని, కష్టమైనా, నష్టమైనా నమ్ముకున్న వాళ్లకే అవకాశమివ్వాలన్న వాదన కూడా వినపడుతుంది. మరి జగన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చూడాల్సి ఉంది. జగన్ అనివార్య పరిస్థితుల్లో రాజీ పడుతున్నట్లు స్పష్టమవుతోంది. మరి ఈ వ్యూహాలు ఏ మేరకు ఫలిస్తాయో, స్థానిక ఎన్నికల్లో వైసీపీ ఏ విధంగా నిలదొక్కుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

## అండమాన్‌లో అల్పపీడనం.. మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండం

- మొదటి పేజి తరువాయి

సంస్థ వెల్లడించింది. ఇది రానున్న రోజుల్లో మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని, దీని ప్రభావంతో కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ప్రజలు, ముఖ్యంగా మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. విపత్తుల నిర్వహణ సంస్థ కథనం ప్రకారం, ప్రస్తుతం అండమాన్‌లో కేంద్రీకృతమైన ఈ అల్పపీడనం క్రమంగా బలపడనుంది. సోమవారం నాటికి ఇది వాయుగుండంగా, మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉంది. అనంతరం వాయవ్య దిశగా పయనించి, బుధవారం ఉదయానికి దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాలకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఈ అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో వాతావరణం మారనుంది. ఆదివారం నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై, పలుచోట్ల విస్తారంగా వర్షాలు పడతాయని తెలిపింది. ముఖ్యంగా సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు కోస్తాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో రానున్న ఐదు రోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. తీరప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

## తిరుమలలో వైభవంగా సాగిన గరుడ సేవ..

- మొదటి పేజి తరువాయి

లక్షలాది మంది భక్తులకు అభయమిచ్చారు. ఈ అపు రూప దృశ్యాన్ని కనులారా వీక్షించేందుకు తరలివచ్చిన భక్తుల "గోవిందా.. గోవిందా.." నామస్మరణలతో సప్తగిరులు మార్మోగాయి. శనివారం సాయంత్రం 6:30 గంటలకు వాహన మండపం నుంచి గరుడ వాహనంపై స్వామివారు బయటకు రాగానే, మాడ వీధుల్లోని గ్యాలరీలలో వేచి ఉన్న భక్తుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. గజరాజులు ముందు నడుస్తుండగా, భజన బృందాలు, కోలాటాలు, జీయంగార్ల ఘోష్టి, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు అత్యంత భక్తిశ్రద్ధలతో సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకుని పులకించిపోయారు.

**భక్తులతో కిక్కిరిసిన మాడ వీధులు**

గరుడ సేవను తిలకించేందుకు దేశం నలుమూలల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. మాడ వీధుల్లోని 1.90 లక్షల మంది సామర్థ్యం గల గ్యాలరీలు శుక్రవారం రాత్రికే భక్తులతో కిక్కిరిసిపోయాయి. గ్యాలరీలలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ శనివారం ఉదయం నుంచే పాలు, అన్నప్రసాదాలు, తాగునీరు, అల్పాహారం వంటివి నిరంతరాయంగా అందించింది. సుమారు 2000 మంది శ్రీవారి సేవకులు ఈ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు సేవలందించారు.

**టీటీడీ ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణ**

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి స్వయంగా మాడ వీధుల్లో పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. జేఈవోలు శరత్, గోపీనాథ్ శిలాతోరణం వద్ద క్యూలైన్లలోని భక్తులకు అందుతున్న అన్నప్రసాదం, నీటి సరఫరాను పరిశీలించారు. సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. సుమారు 600 మంది టీటీడీ ఉద్యోగులు తిరుమలలోని 8 కీలక ప్రాంతాల్లో సెక్టోరల్ అధికారులుగా విధులు నిర్వర్తించారు. వైష్ణవ సంప్రదాయంలో గరుడ సేవకు విశిష్ట ప్రాధాన్యం ఉంది. జ్ఞాన, వైరాగ్యాలకు ప్రతీక అయిన గరుత్మంతునిపై ఉన్న స్వామివారిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ అద్భుతమైన కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, పలువురు టీటీడీ బోర్డు సభ్యులు, జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అర్ధాంగి వసుంధర దేవి కూడా ఈ వేడుకకు హాజరయ్యారు.

# పేదల ఆనందం చూసి నా జీవితం ధన్యమైంది

- మొదటి పేజి తరువాయి

కన్వీనియన్స్ డీడ్స్ అందజేశారు. ఈ నిర్ణయంతో వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపామని అన్నారు. వేలాది కుటుంబాల దశాబ్దాల కల సాకారమైన వేళ వారి ముఖాల్లో వెల్లివిరిసిన ఆనందాన్ని చూసి, "మీ ముఖాల్లో ఈ ఆనందం చూస్తే నా జీవితం ధన్యమైంది. నా ప్రాణం ఉన్నంతవరకు ఈ క్షణాన్ని గుర్తుపెట్టుకుంటాను" అంటూ చంద్రబాబు భావోద్వేగంతో ప్రసంగించారు. ఇది కేవలం పట్టాల పంపిణీ కాదని, పేద ప్రజల ఆత్మగౌరవానికి, వారి పిల్లల భవిష్యత్తుకు చేస్తున్న పట్టాభిషేకం అని ఆయన అభివర్ణించారు.

**దశాబ్దాల నిరీక్షణకు తెర.. సర్వ హక్కులు మీవే!**

"కూడు, గూడు, గుడ్డ అనేది మా విధానం. 40 ఏళ్ల క్రితమే ఎన్టీఆర్ పేదలకు పక్కా ఇళ్లు ఇవ్వాలని సంకల్పిస్తే, అదే స్ఫూర్తితో మేము పనిచేస్తున్నాం" అని చంద్రబాబు గుర్తుచేశారు. దశాబ్దాలుగా సొంత కష్టార్జితంతో నిర్మించుకున్న ఇళ్లలో నివసిస్తున్నా, వాటిపై పూర్తి హక్కు లేదనే వేదనతో జీవిస్తున్న లక్షలాది మందికి ఈ పట్టాభిషేకం ద్వారా విముక్తి కల్పించామన్నారు. "నిన్నటి వరకు మీ ఇంటిపై మీకు హక్కు లేదు. కానీ ఈరోజు నుంచి మీ ఇంటి మీద సర్వ హక్కులు మీవే. ఇకపై అనుమానం లేదు, వివాదం లేదు, భయం లేదు. తిరుగులేని హక్కు మాత్రమే ఉంటుంది" అని ఆయన భరోసా ఇచ్చారు. విశాఖ నగర పరిధిలోని గాజువాక, పెందుర్తి, భీమిలి, గోపాలపట్నం సహా 111 మండలాల్లోని 399 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 19.33 లక్షల చదరపు గజాల భూమిని క్రమబద్ధీకరించి, రూ. 8,874 కోట్ల రిజిస్ట్రేషన్ విలువైన ఆస్తిని ప్రజలకు అప్పగించామని తెలిపారు. "నిన్నటి వరకు అప్పు కావాలంటే గ్యారెంటీ లేని మీరు, ఈరోజు ఈ ప్రభుత్వం ఇచ్చిన పట్టాతో ఏ బ్యాంకులోనైనా స్వేచ్ఛగా రుణం పొందవచ్చు" అని ఆయన స్పష్టం చేశారు.

**మిగిలిన వారికీ త్వరలోనే పట్టాలు.. అధికారులకు ఆదేశాలు**

ఈ కార్యక్రమంతోనే ఆగమని, వివిధ కారణాలతో ఆగిపోయిన మరో 35 కాలనీల్లోని 10,000 కుటుంబాలకు, వివాదాల్లో ఉన్న పంచగ్రామాల పరిధిలోని 12,149 మందికి కూడా త్వరలోనే పట్టాలు అందించి శాశ్వత హక్కులు కల్పిస్తామని చంద్రబాబు సభాముఖంగా హామీ ఇచ్చారు. "దేవాలయ భూముల వివాదాలను కోర్టుల ద్వారా పరిష్కరించి, వీలైనంత తొందరగా మీ అందరికీ న్యాయం చేసే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుంది" అని ఆయన కలెక్టర్‌కు వేదిక నుంచే ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న ప్రతి పేదవాడికీ హక్కు పత్రాలు అందించి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడటమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

**దాన్ని నిర్వహించాలంటే ఏనుగును మేపినట్టే!**

గత ఐదేళ్ల పాలనపై చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత ఐదేళ్లు ఒక పీడకల. రూ. 10 లక్షల కోట్ల అప్పులు, ఎక్కడ చూసినా కుంభకోణాలు, భూకబ్జాలు, కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారు. ప్రశాంతమైన ఉత్తరాంధ్రలో అలజడి సృష్టించారు. శుక్రవారం వచ్చిందంటే ఏ ఇంటిని కూలుస్తారో తెలియని భయానక వాతావరణం ఉండేది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "విశాఖను రాజధాని చేస్తామంటూనే, రుషికొండపై ఋషులు తపస్సు చేసిన చోట ప్యాలెస్‌లు కట్టుకున్నారు. ఆ ప్యాలెస్‌ను ఏం చేయాలో కూడా అర్థం కాని దుస్థితిలో మేమున్నాం. దాన్ని నిర్వహించాలంటే ఏనుగును మేపినంత ఖర్చు అవుతుంది" అని ఎద్దేవా చేశారు. "నాడు కబ్జాలు, కూల్చివేతలు ఉంటే.. నేడు హక్కులు, భరోసా ఇస్తున్నాం. విధ్వంసం నుంచి వికాసం వైపు, భయం నుంచి భరోసా వైపు, నిరాశ నుంచి కొత్త ఆశల వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం" అని ఆయన ఉద్ఘాటించారు.

**విశాఖ ఇక విశ్వనగరం.. నీటి సమస్యకు ఎన్డీయే గ్యారెంటీ!**

విశాఖపట్నం భవిష్యత్తుపై చంద్రబాబు స్పష్టమైన దార్శనికతను ఆవిష్కరించారు. "రాబోయే రోజుల్లో విశాఖ ఒక విశ్వనగరంగా మారబోతోంది. ఇది ఇక అన్‌స్టాపబుల్. గూగుల్, రిలయన్స్ డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులతో పాటు అనేక ఐటీ పరిశ్రమలు వస్తున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక గేమ్ ఛేంజర్‌గా మారనుంది" అని ఆయన ప్రకటించారు. విశాఖ నీటి సమస్యపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ, "ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తగ్గినా, ముందుచూపుతో మేము పూర్తి చేసిన పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీళ్లు తెచ్చాం. ఇప్పుడు అదే కాలువను విశాఖ వరకు పొడిగించి, గోదావరి జలాలతో నగర దాహార్తిని శాశ్వతంగా తీర్చే బాధ్యత మా ఎన్డీయే ప్రభుత్వానిది. భవిష్యత్తులో విశాఖకు నీటి కొరత ఉండదు, ఇది మా గ్యారెంటీ" అని చంద్రబాబు గట్టిగా హామీ ఇచ్చారు.

**అభివృద్ధికి అండగా నిలవండి.. 2047 లక్ష్యం మనదే!**

పరిశ్రమలు తెచ్చి అవకాశాలు కల్పించడం తమ బాధ్యత అని, వాటిని అందిపుచ్చుకుని యువత ఎదగాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. "విశాఖ ఉక్కును కాపాడింది ఎన్డీయే ప్రభుత్వం. రైల్వే జోన్‌ను రియాలిటీగా మార్చింది మేము. పేదరికం లేని సమాజం, ఆర్థిక అసమానతలు తగ్గడమే మా లక్ష్యం" అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, 'స్వచ్ఛాంధ్ర'లో భాగస్వాములు కావాలని కోరారు. "2047 నాటికి 'వికసిత భారత్'తో దేశం ప్రపంచంలో నంబర్ వన్ అవుతుంది. అదే సమయంలో 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యంతో మన రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతాం. ప్రపంచంలోనే తెలుగు జాతిని అత్యంత శక్తివంతమైన జాతిగా తీర్చిదిద్దే బాధ్యత మనందరిదీ" అని పిలుపునిస్తూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, నారాయణ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఇంటర్ బోర్డులో డిజిటలైజేషన్, రిటైర్మెంట్ వయోపరిమితి పెంపు

- మొదటి పేజి తరువాయి

అనేక కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేశారు. నకిలీ సర్టిఫికెట్ల అక్రమాలకు శాశ్వతంగా ముగింపు పలకాలనే దృఢ సంకల్పంతో 1978 నుంచి జారీ చేసిన ఇంటర్మీడియట్ విద్యార్హత పత్రాలన్నింటినీ సమగ్రంగా డిజిటలైజ్ చేయాలని ప్రతిపాదించారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు ఈ రికార్డులను అత్యాధునిక 'బ్లాక్‌చైన్ టెక్నాలజీ'తో అనుసంధానించనున్నారు. విద్యా పునర్నిర్మాణంతో పాటు ఇంటర్మీడియట్ బోర్డు పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి తీపి కబురు అందిస్తూ వారి పదవీ విరమణ వయోపరిమితిని 60 సంవత్సరాల నుంచి 62 ఏళ్లకు పెంచుతూ తుది తీర్మానం చేశారు. దీనికితోడు పరీక్షల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేసే క్రమంలో ఇన్విజిలేటర్లు, మూల్యాంకనదారుల శ్రమను గుర్తించి వారు అందుకునే భత్యాలను ఏకంగా 25 శాతం వరకు పెంచే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు.

పరీక్షల్లో విద్యార్థుల సౌకర్యార్థం థియరీ సబ్జెక్టులకు 32 పేజీల బుక్‌లెట్లను అందించనున్నారు. మూల్యాంకనంలో ఏమాత్రం అలసత్వం వహించినా లేదా తీవ్రమైన తప్పులకు పాల్పడినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది.

## భారత యువత సత్తాకు స్టార్టప్‌లే నిదర్శనం

దేశ యువత సామర్థ్యానికి, వారి సత్తాకు దేశంలోని స్టార్టప్ పర్యావరణ వ్యవస్థే ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఒకప్పుడు కేవలం పెద్ద నగరాలకే పరిమితమైన స్టార్టప్‌ల కథ ఇప్పుడు చిన్న పట్టణాలకు, నగరాలకు కూడా విస్తరించిందని ఆయన పేర్కొన్నారు.

20వ రోజ్‌గార్ మేళా సందర్భంగా శనివారం ఆయన వివిధ ప్రభుత్వ సంస్థలకు కొత్తగా ఎంపికైన యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల నుంచి 51,000 మందికి పైగా యువతకు నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "భారతదేశం నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా నిలిచింది. గుర్తించబడిన స్టార్టప్‌లలో దాదాపు సగం టైర్-2, టైర్-3 నగరాల్లోనే ఉన్నాయి. ఇది భారతదేశ నూతన ఆర్థిక వ్యవస్థలో గ్రామాలు, పట్టణాలు, చిన్న నగరాల నుంచి వచ్చిన యువత కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని చూపిస్తోంది" అని వివరించారు. చిన్న పట్టణాలకు చెందిన యువత తమ సొంత ఆలోచనలతో కొత్త కంపెనీలను స్థాపిస్తూ, తమతో పాటు ఇతర యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలను వేగంగా విస్తరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ స్పష్టం చేశారు. "ఈ లక్ష్యంతోనే సుమారు రూ. 1 లక్ష కోట్లతో 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రారంభించాం. ఈ పథకం ద్వారా దాదాపు 2 కోట్ల మంది యువత తొలిసారిగా ఉద్యోగ రంగంలోకి ప్రవేశించే అవకాశం లభిస్తుంది. మొదటిసారి ఉద్యోగంలో చేరేవారికి రూ. 15,000 వరకు ప్రోత్సాహకం అందించడంతో పాటు, కొత్త ఉద్యోగాలను సృష్టించే యాజమాన్యాలకు కూడా ప్రోత్సాహకాలు ఉంటాయి" అని తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలో భాగం కాబోతున్న నూతన ఉద్యోగులకు ప్రధాని కీలక సూచనలు చేశారు. "మీరు, మీ తల్లిదండ్రులు ఎదుర్కొన్న ఇబ్బందులు, కష్టాలు దేశంలోని ఏ పౌరుడూ ఎదుర్కోకుండా చూడటమే మీ లక్ష్యం కావాలి. ప్రభుత్వ సేవలో చేరిన వెంటనే ఈ మిషన్‌ను మీరు చేపట్టాలి" అని పిలుపునిచ్చారు. నిరంతరం నేర్చుకోవడం, కొత్త నైపుణ్యాలు, టెక్నాలజీని అందిపుచ్చుకోవడం చాలా ముఖ్యమని ఆయన అన్నారు. ఇందుకోసం 'మిషన్ కర్మయోగి'ని రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే 1.70 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగులు 'ఐ-గాట్ కర్మయోగి' ప్లాట్‌ఫామ్‌లో చేరారని, కొత్తగా చేరే వారి కోసం 'కర్మయోగి ప్రారంభ్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని సిద్ధం చేశామని వివరించారు. మీరు మిమ్మల్ని ఎంతగా మెరుగుపరుచుకుంటే, దేశ పౌరులకు అంత మెరుగైన సేవలు అందించగలరని ప్రధాని పేర్కొన్నారు.

## సొంత నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన.. సోమవారం నుంచే!

- మొదటి పేజి తరువాయి

సోమవారం, రూ. 9.59 కోట్లతో ఆధునికీకరించిన నాగులాపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్ని పవన్ కల్యాణ్ ప్రజలకు అంకితం చేయనున్నారు. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ పథకం ద్వారా చివరి గ్రామాలకు నీరు అందడం లేదన్న సమస్యకు ఈ ఆధునికీకరణతో పరిష్కారం లభించనుంది. దీని ద్వారా 52 ఆవాసాల్లోని సుమారు 97 వేల మందికి తాగునీటి కష్టాలు తీరనున్నాయి. దీంతో పాటు, పిఠాపురం పట్టణంలో ఆహ్లాదకర వాతావరణం కోసం ఏర్పాటు చేసిన 'పీఠికాపుర వనం', చందుర్తి-తాటిపర్తి బీటీ రోడ్డును కూడా ఆయన ప్రారంభించనున్నారు. మంగళవారం నిర్వహించే బహిరంగ సభలో నియోజకవర్గ రూపురేఖలు మార్చే కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. పిఠాపురం ప్రజల చిరకాల వాంఛ అయిన రూ. 200 కోట్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, రూ. 80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్స్, రూ. 118 కోట్లతో రోడ్ ఓవర్ బ్రిడ్జి, రూ. 323 కోట్లతో ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ వంటి భారీ పనులకు ఆయన శ్రీకారం చుడతారు. వీటితో పాటు జల్ జీవన్ మిషన్, అమృత్ 2.0 పథకాల కింద పలు తాగునీటి ప్రాజెక్టులకు కూడా పచ్చజెండా ఊపనున్నారు.

ఈ అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ కార్యక్రమాలకు కూడా పవన్ ప్రాధాన్యత ఇస్తున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం స్వయం సహాయక సంఘాలకు రూ. 120 కోట్ల రుణాలను అందజేయనున్నారు. ఉప్పాడ తీరప్రాంత

మత్స్యకారులకు ఆధునిక లైఫ్ జాకెట్లు, డ్రై ఫిష్ యూనిట్లు, ఐస్ బాక్సులతో కూడిన మోటార్ సైకిళ్లను పంపిణీ చేసి వారి జీవనోపాధికి భరోసా కల్పించనున్నారు. అదేవిధంగా, 89 మంది లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ పట్టాలు అందించి వారి భూములపై హక్కులు కల్పించనున్నారు. ఈ రెండు రోజుల పర్యటన ద్వారా నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి పవన్ కల్యాణ్ పటిష్ఠమైన పునాదులు వేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## కర్ణాటక పర్యటనలో అమిత్ షాకు అస్వస్థత

- మొదటి పేజి తరువాయి

మహాస్వామిగళు మూరుసవిర్మఠ్ మెడికల్ కాలేజీ నూతన భవనాన్ని, 1,200 పడకల కేఎల్‌ఈ హాస్పిటల్ అండ్ మెడికల్ రీసెర్చ్ సెంటర్‌ను అమిత్ షా ప్రారంభించాల్సి ఉంది. రూ. 700 కోట్ల వ్యయంతో ఈ మెడికల్ కాలేజీ భవనాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమం నిమిత్తం షెడ్యూల్ ప్రకారమే శుక్రవారం రాత్రి ఆయన హుబ్బళ్లి చేరుకుని ఒక హోటల్‌లో బస చేశారు. అయితే, శనివారం ఉదయం ఆయన అనారోగ్యానికి గురికావడంతో ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. అమిత్ షా గైర్హాజరీలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, కర్ణాటక వైద్య విద్యా శాఖ మంత్రి శరణ్ ప్రకాశ్ పాటిల్, మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనారోగ్య కారణాల వల్లే అమిత్ షా ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారని కేఎల్‌ఈ సొసైటీ ఛైర్మన్ ప్రభాకర్ కోరే స్పష్టం చేశారు.

## మానవత్వం చాటుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

- మొదటి పేజి తరువాయి

అదే సమయంలో సిరిసిల్ల వైపు వెళ్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రమాదాన్ని గమనించి.. వెంటనే తన వాహనాన్ని నిలిపి భద్రతా సిబ్బందితో కలిసి కారు వద్దకు వెళ్లారు. కారులో చిక్కుకున్న బాధితులను బయటకు తీసేందుకు సహకరించారు. తీవ్రంగా గాయపడిన కుమార్తెతో పాటు ఆమె తల్లిదండ్రులను తన భద్రతా సిబ్బంది వాహనంలో వెంటనే ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కేంద్ర మంత్రి సూచించారు.

## ఏపీ అమ్మాయిలు టీమిండియాలో ఆడాలి

- మొదటి పేజి తరువాయి

సంతోషాన్ని పంచుకున్నారు. "మంగళగిరిలో తొలి మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ప్రారంభం కావడం చాలా ఆనందంగా ఉంది. యువ మహిళా క్రికెటర్లు తమ ప్రతిభను ప్రదర్శించడానికి, ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి డబ్ల్యూఏపీఎల్ బలమైన పునాది వేస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. ఈ టోర్నీకి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న మిథాలీరాజ్‌కు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని క్రీడాకారిణులకు డబ్ల్యూపీఎల్, ఆ తర్వాత టీమిండియాకు ఆడే మార్గాన్ని సుగమం చేస్తున్న ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌ను లోకేశ్ అభినందించారు. టోర్నీలో పాల్గొంటున్న నాలుగు జట్లకు, ప్రతి క్రీడాకారిణికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ టోర్నమెంట్ ద్వారా ఆంధ్రప్రదేశ్ నుంచి భవిష్యత్ ఛాంపియన్లు ఆవిర్భవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు.

## కరవులో రైతాంగం.. దోపిడీలో కూటమి ప్రభుత్వం

అధికార పీఠం ఎక్కేందుకు ఊహాజనిత హామీలతో ప్రజలను నమ్మించి, అధికారంలోకి వచ్చాక ఆ హామీలను పూర్తిగా పక్కనబెట్టేసిందని కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నాయకుడు పేర్ని నాని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా సాగునీరు అందక, సరైన ప్రణాళికలు లేక కరవు కోరల్లో చిక్కుకుని రైతాంగం అల్లాడిపోతుంటే... కూటమి నాయకులు మాత్రం పాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని దోచుకోవడంలో నిమగ్నమయ్యారని ధ్వజమెత్తారు. గతంలో జగన్ అందించిన పారదర్శక సంక్షేమ పథకాల కంటే మిన్నగా పథకాలు ఇస్తామంటూ ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలు ఇప్పుడు ప్రకటనలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ప్రభుత్వ అశాస్త్రీయ విధానాలు, మోసపూరిత వైఖరిపై నియోజకవర్గాల వారీగా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, ఇప్పటికే పలు ప్రాంతాల్లో బాధితులు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారని గుర్తుచేశారు. ఈ ప్రజాగ్రహం నుంచి తప్పించుకునేందుకే కూటమి నాయకత్వం ప్రతిరోజూ కొత్త నాటకాలకు తెరలేపుతోందని, ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే రాబోయే రోజుల్లో ప్రజల నుంచి కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని పేర్ని నాని హెచ్చరించారు.

# పూల సుబ్బయ్య వెలిగొండ ఫీడర్ కెనాల్‌లో నీటి ప్రవాహం అధికం - ప్రజలు నీటిలోకి దిగరాదు

**పెద్ద దోర్నాల పెన్ పవర్ సెప్టెంబర్ 19**



పూల సుబ్బయ్య వెలిగొండ ఫీడర్ కెనాల్‌లో ప్రస్తుతం నీటి ప్రవాహం అధికంగా ఉన్నందున ప్రజలు, సందర్శకులు, యువత ఎట్టి పరిస్థితుల్లోనూ కెనాల్‌లోకి దిగరాదని, ఎస్సై వెంకటరమణయ్యసూచించారు. ఈ సందర్భంగా వినాయక నిమజ్జనం, బట్టలు ఉతకడం, త్రాగు నీటి కోసం మరియు ఇతర కార్యక్రమాల సందర్భంగా కెనాల్ వద్దకు వచ్చే ప్రజలు నీటిలోకి వెళ్లకుండా, ప్రమాదకర ప్రాంతాలకు సమీపంలో నిలబడకుండా జాగ్రత్తలు పాటించాలి. చిన్నపిల్లలను నీటి ప్రాంతాలకు తీసుకెళ్లినప్పుడు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అధిక నీటి ప్రవాహం కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజల భద్రత దృష్ట్యా ఈ సూచనలు జారీ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ప్రజలు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించి సహకరించాలని కోరారు.

పెన్ పవర్

మార్కాపురం - ప్రకాశం

# పంచాయతీలో రసీదుల గోల్ మాల్


**మాన్యువల్ లో ఒకరు.. ఆన్లైన్ లో మరొకరు..!**


**ఫోటో ఎవిడెన్స్ తో బయటపడ్డ లక్షల పన్నుల స్కామ్**

**స్వర్ణ పంచాయతీ యాప్ చెబుతున్న దొంగ లెక్కలు**

**బాధితుడి వాయిస్,రసీదులు పెన్ పవర్ వద్ద**

**పనులు లేకుండానే బిల్లులు.. సమగ్ర విచారణకు డిమాండ్**





**కొనకనమిట్ల, పెన్ పవర్, సెప్టెంబర్ 19**

కొనకనమిట్ల గ్రామ పంచాయతీలో ఇంటి పన్నుల వసూళ్లలో జరుగుతున్న అక్రమం ఫోటో సాక్ష్యంతో బట్టబయలైంది. ప్రభుత్వం పారదర్శకత కోసం స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారా ఆన్లైన్ రసీదులు తప్పనిసరి చేసినా, ఇక్కడ మాత్రం మాన్యువల్ రసీదులతోనే వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.ఓ బాధితుడి వాయిస్, రసీదులు పెన్ పవర్ ప్రతినిధికి అందజేశాడు.

**అసెస్ మెంట్ 397,406,410 చుట్టూ తిరుగుతున్న అనుమానం..**



ఈ మోసానికి అసెస్ మెంట్ నెంబర్ 397 ఒక ఉదాహరణ. బాధితుడి వద్ద ఉన్న మాన్యువల్ రసీదు ప్రకారం 18-04-2025న యక్కంటి వెంకటేశ్వరరెడ్డి నుండి రూ.1,200 వసూలు చేసినట్లు పంచాయతీ ముద్రతో రసీదు ఇచ్చారు. కానీ అదే పాత నెంబర్ ను స్వర్ణ పంచాయతీలో కొడితే కొత్త అసెస్ మెంట్ నెంబర్ 23536700399 గా, యజమాని పేరు యెడుల శేషయ్యగా చూపిస్తోంది.ఇదే తరహాలో మరికొన్ని బిల్లులు ఉండడం విశేషం.ఒకరి దగ్గర డబ్బు తీసుకుని ఇంకొకరి ఖాతాలో తక్కువ మొత్తం జమ చేసి మిగతాది సొంతానికి మళ్లించారా అనే అనుమానం బలంగా వ్యక్తమవుతోంది.

**ఒకరిద్దరిది కాదు.. 750 ఇళ్లలో ఇదే తంతు..**

ఇది ఒక్క ఇంటి వ్యవహారం కాదని గ్రామస్థులు చెబుతున్నారు. పంచాయతీ పరిధిలో 750 ఇళ్లు ఉండగా, అధిక శాతం మందికి ఇలాగే మాన్యువల్ రసీదులు ఇచ్చారని ఆరోపణ. యక్కంటి వెంకటేశ్వరరెడ్డి అనే రైతు నుండి కుటుంబ సభ్యుల పేర్లపై కలిపి రూ.25 వేల వరకు వసూలు చేసి ఆన్లైన్ రసీదు ఇవ్వలేదని, దానికి సంబంధించిన వాయిస్ రికార్డు పెన్ పవర్ వద్ద ఉంది. ఈ లెక్కన రూ.4 నుంచి 5 లక్షల వరకు ప్రజల సొమ్ము పక్కదారి పట్టి ఉంటుందని అంచనా.

పన్నులే కాదు.. పనుల్లోనూ అక్రమాలా...

ఇంటి పన్నుల వసూళ్లలోనే కాకుండా, పంచాయతీలో అభివృద్ధి పనులు చేయకుండానే చేసినట్లు రికార్డుల్లో చూపించి బిల్లులు తీసుకున్నారనే మరో ఆరోపణ కూడా వినిపిస్తోంది. దీంతో పంచాయతీ నిధులన్నీ దుర్వినియోగం అవుతున్నాయని, పారదర్శకత లేకుండా పోయిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులు ఏం చేస్తారు..**

ఇన్ని ఆధారాలు, ఫోటోలు, వాయిస్ రికార్డులు బయటకు వచ్చినా మండల స్థాయి అధికారులు పట్టించుకోకపోవడంపై గ్రామస్థుల్లో అనుమానాలు పెరుగుతున్నాయి. ఈ వ్యవహారంపై జిల్లా పంచాయతీ అధికారి (డిపిఓ) వెంటనే స్పందించాలని, స్వర్ణ పంచాయతీ లెక్కలు, మాన్యువల్ రసీదులు, బ్యాంక్ స్టేట్ మెంట్ లను ఆడిట్ చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిజం నిగ్గు తేలితేనే ప్రజల్లో నమ్మకం నిలుస్తుందని వారు కోరుతున్నారు.

# జగన్ కారణంగానే రీసర్వే చిక్కులు

**-కూటమి ప్రభుత్వంలో అవన్నీ తొలగిస్తున్నాం -ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**

**-కొల్లగుంటలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ**

**-స్వర్ణాంధ్ర - స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే**







**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 19**

మండలంలో 12 పంచాయతీలకు సంబంధించి 5098 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు కాగా అనంతసాగరం (కొల్లగుంట) గ్రామానికి తొలివిడతలో కేటాయించిన 491 పాసుపుస్తకాలను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగన్ అనాలోచిత నిర్ణయాలవల్ల రీసర్వే మొత్తం తప్పులతడకగా మారిందని విమర్శించారు. అనంతసాగరం గ్రామంలో కూడా 56 ఎకరాల భూమిని గ్రామకంఠం కింద తప్పుగా నమోదు చేశారని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఇలాంటి చిక్కులు అనేకం ఉన్నాయని.... కూటమి ప్రభుత్వం వచ్చాక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి, ఆ తప్పులను సరిచేస్తున్నామని ఎమ్మెల్యే తెలియజేశారు. కందుకూరు మండలంలోని అన్ని గ్రామాలలో తాగునీటి సమస్య ఉందని, దానిని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి శాశ్వత పరిష్కారానికి 30 కోట్లు మంజూరు చేయించినట్లు నాగేశ్వరరావు చెప్పారు. టెండర్లు పూర్తయి పనులు జరుగుతున్నాయని, మరో ఐదారు నెలల్లో ఇంటింటికి కుళాయి ద్వారా రామతీర్థం నీటిని అందించబోతున్నామని గ్రామస్తుల హర్షధ్వానాల మధ్య ఎమ్మెల్యే ప్రకటించారు. గ్రామపరిధిలోని 4/1, 95 సర్వే నెంబర్లలో ఇళ్ల స్థలాలు, ఇతర భూసమస్యలను పరిష్కరించాలని పలువురు గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించారు. జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కారాన్ని కృషి చేస్తానని నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. గ్రామంలో రెండున్నర ఏళ్లలో 22 లక్షలతో సిసి రోడ్లతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఎమ్మెల్యే వివరించారు. గ్రామంనుంచి కనిగిరిరోడ్డు వరకు తారురోడ్డు నిర్మాణానికి 70 లక్షలతో ప్రతిపాదించగా, త్వరలోనే పనులు మొదలవుతాయని చెప్పారు. అంతకుముందు స్వర్ణాంధ్ర - స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా, గ్రామంలో జరిగిన ర్యాలీలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాయపాటి సుభాషిని శ్రీనివాసరావు, తహసిల్దార్ మురళి, ఎంపీడీవో రత్నజ్యోతి, అల్లం వెంకటేశ్వర్లు,గ్రామపార్టీ అధ్యక్షుడు బైరపునేని రమణయ్య, ఏఎంసీ డైరెక్టర్ మాదాల వెంకటేశ్వర్లు, గ్రామ నాయకులు బైరపునేని కోటయ్య, శ్రీకాంత్, బోయపాటి శ్రీను, కంచర్ల మాధవ, గోగినేని వెంకటేశ్వర్లు, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

# చీపురు పట్టిన ఎమ్మెల్యే కందుల

**- రాజ్యలక్ష్మి కాలనీలో స్వచ్ఛ మార్కాపురం**





**మార్కాపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 19**

మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని 31వ వార్డు రాజ్యలక్ష్మి కాలనీలో శుక్రవారం నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ మార్కాపురం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కాలనీలో పేరుకుపోయిన చెత్త చెదారాలను మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి స్వయంగా చీపురు పట్టి శుభ్రం చేశారు. అనంతరం స్థానికులతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలాలను శుభ్రంగా ఉంచుకోకపోతే చుట్టుపక్కల వారు రోగాల బారిన పడతారని, అలా ఉంచుకోని వారిపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మార్కాపురం ఆహ్లాదకరంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, టిడిపి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహనతోనే గిరిజనులకు, బలహీన వర్గాలకు పూర్తి న్యాయం: జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత

**సమాజంలో అత్యంత వెనుకబడిన గిరిజనులకు చట్టాల అవగాహన అత్యంత ఆవశ్యకం**

**దోర్నాల లో ఘనంగా 'నాల్సా' నూతన మోడ్యూల్ న్యాయ అవగాహన సదస్సు -గిరిజనుల హక్కుల పరిరక్షణ, వయోవృద్ధుల రక్షణపై విస్తృత అవగాహన**

**హాజరైన ఒంగోలు ప్రధాన జిల్లా న్యాయమూర్తి ఎ. సత్యానంద్, మార్కాపురం 6వ అదనపు జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి వి. భవాని**





**పెద్ద దోర్నాల పెన్ పవర్ సెప్టెంబర్ 19**

గిరిజన ప్రాంత ప్రజలు, సమాజంలోని బలహీన వర్గాలు తమ రాజ్యాంగ, చట్టబద్ధమైన హక్కుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరికీ చట్టపరమైన రక్షణ మరియు ఉచిత న్యాయ సేవలు అందడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తోందని మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత పేర్కొన్నారు. శనివారం డోర్నాల మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఒంగోలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మార్కాపురం మండల న్యాయ సేవాధికార కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో 'నాల్సా' నూతన మోడ్యూల్ న్యాయ అవగాహన మరియు ఉచిత సేవా శిబిరం ఘనంగా నిర్వహించబడింది. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, మార్కాపురం 6వ అదనపు జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి వి. భవాని అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ప్రసంగిస్తూ - గిరిజనుల సంక్షేమం మన జిల్లాలో ఇటువంటి సమగ్ర న్యాయ అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం అభినందనీయమని వ్యాఖ్యానించారు. గిరిజనులు అత్యంత సున్నితమైన, దట్టమైన మరియు దూర ప్రాంతాల్లో నివసిస్తున్నందున, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చట్టపరమైన రక్షణలు పూర్తిస్థాయిలో చేరాల్సిన అవసరం ఉందన్నారు.

**చట్టపరమైన హక్కులు - బాధ్యతలు...:** గ్రామాల్లో చిన్న చిన్న గొడవలు కూడా తీవ్రరూపం దాల్చి ఎఫ్.ఐ.ఆర్, తీవ్రమైన సెక్షన్లు మరియు బెయిల్ లభించని పరిస్థితికి దారితీస్తుంటాయని, కాబట్టి ఏ చట్టం ఎలాంటి అవకాశాలు కల్పిస్తుంది, చట్ట ఉల్లంఘన వల్ల కలిగే నష్టాలేమిటో ప్రజలు తెలుసుకోవాలన్నారు. చట్టాలపై అవగాహనతో పాటు పౌర బాధ్యతలను గుర్తుంచుకోవడం ప్రధానమని స్పష్టం చేశారు.

**అక్షరాస్యత మరియు లీగల్ లిటరసీ...:** గిరిజన ప్రాంతాల్లో సాధారణ అక్షరాస్యతతో పాటు 'లీగల్ లిటరసీ' (న్యాయ విజ్ఞానం) పెంపొందించడం చాలా ముఖ్యమని, అప్పుడే వారు తమకు జరిగే అన్యాయాలపై ధైర్యంగా పోరాడగలరని చెప్పారు.

**బాధితులకు ఉచిత న్యాయ సాయం...:** ప్రమాదాల భారిన పడిన బాధితులకు, ఇన్సూరెన్స్ హక్కులు, మహిళలు, పిల్లల రక్షణ చట్టాలు, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం వంటి అనేక అంశాలపై నాల్సా ద్వారా లీగల్ ఎయిడ్ మరియు పారా లీగల్ వాలంటీర్లు అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

**చట్టం ముందు అందరూ సమానులే:** ప్రధాన జిల్లా న్యాయమూర్తి ఎ. సత్యానంద్. ఒంగోలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు డి.ఎల్.ఎస్.ఎ చైర్‌పర్సన్ ఎ. సత్యానంద్ సభను ఉద్దేశించి మాట్లాడుతూ, రాజ్యాంగం ప్రకారం చట్టం ముందు అందరూ సమానులేనని తెలిపారు. ఆర్థిక స్తోమత లేక ఏ ఒక్కరినీ న్యాయానికి దూరం చేయకూడదనే ఉద్దేశంతోనే న్యాయ సేవాధికార సంస్థల ద్వారా ఉచిత న్యాయవాది సేవలు, న్యాయ సహాయం ఉచితంగా అందజేస్తున్నామని వివరించారు. దేశంలో ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందించడానికి అత్యున్నతమైన వ్యవస్థలు పనిచేస్తున్నాయని, సుప్రీంకోర్టు పరిధిలో జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ నల్సార్ రాష్ట్రాల స్థాయిలో స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, మరియు ప్రతి జిల్లా కోర్టు హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ డిఎల్ఎస్ఓ అందుబాటులో ఉంటాయని తెలిపారు. జిల్లా ప్రాధికార సంస్థకు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి చైర్మన్‌గా, మండల న్యాయ సేవల కమిటీకి మండల సీనియర్ మోస్ట్ న్యాయమూర్తి చైర్మన్‌గా ఉంటారని వివరించారు. ప్రజలకు ఎటువంటి కష్టం వచ్చినా లేదా న్యాయపరమైన సలహాలు, సూచనలు అవసరమైనా ఈ సంస్థలు ఉచితంగా న్యాయసహాయం మరియు ఉచిత లాయర్ సేవలను అందిస్తాయని పేర్కొన్నారు. బాధితులు స్వయంగా దరఖాస్తు రాసుకోలేకపోతే అక్కడ ఉన్న సిబ్బందే స్వయంగా అర్జీలు రాసి పరిశీలిస్తారని చెప్పారు. న్యాయస్థానాలలో కేసుల భారం పెరుగుతున్న దృష్ట్యా, కోర్టుల చుట్టూ తిరగకుండా ముందస్తు వివాద పరిష్కార (ప్రీ-లిటిగేషన్) మార్గాలను ఎంచుకోవడం శ్రేయస్కరమని తెలియజేశారు. లోక్ అదాలత్ ద్వారా సివిల్ కేసులు మరియు రాజీపడదగిన క్రిమినల్ కేసులను పరస్పర అంగీకారంతో వేగంగా పరిష్కరించుకోవచ్చని, వీటికి అపీలు కూడా ఉండదని వివరించారు. మధ్యవర్తిత్వం (మీడియేషన్) ద్వారా కూడా వివాదాలను సమగ్రంగా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి వాహనదారులు ఎల్లప్పుడూ జాగ్రత్త వహించాలని, ముఖ్యంగా 18 ఏళ్ల లోపు పిల్లలకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని, లైసెన్స్ లేకుండా నడిపి ప్రమాదం చేస్తే ఇన్సూరెన్స్ కంపెనీలు పరిహారం చెల్లించవు కాబట్టి సరైన డ్రైవింగ్ లైసెన్స్, చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ ఉంచుకోవడమే కాకుండా, చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని వ్యాఖ్యానించారు.


మార్కాపురం 6వ అదనపు జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి వి. భవాని మాట్లాడుతూ.. మన దేశంలో కొంతమందిలో చట్టాలపై సరైన అవగాహన లేకపోవడం వల్ల "చట్టం తెలియక తప్పు చేశాను" అని క్షమాపణ కోరితే చట్టపరంగా మినహాయింపు ఉండదని పేర్కొన్నారు. అందుకే ప్రతీ పౌరుడు చట్టాల పట్ల ప్రాథమిక అవగాహన కలిగి ఉండటం అత్యంత ఆవశ్యకమని వ్యాఖ్యానించారు. న్యాయ సేవా సంస్థలు ప్రత్యేక వాహనాలు, అవగాహన సదస్సుల ద్వారా మారుమూల గ్రామాలు మరియు గిరిజన ప్రాంతాలకు వెళ్తూ ప్రజలకు చట్టాలపై చైతన్యం కలిగిస్తున్నాయని తెలిపారు. సమాజంలో హక్కులతో పాటు బాధ్యతలు కూడా సమ ప్రాధాన్యత కలిగి ఉంటాయన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించడం పౌరుల ప్రాథమిక బాధ్యతని, ప్రమాద ఘటనను చూసిన సాక్షులు కోర్టుకు వచ్చి సరైన సాక్ష్యం చెబితేనే నేరస్థులకు శిక్ష పడి, సమాజంలో నేరాలు తగ్గుతాయని వెల్లడించారు.

**ప్రధానంగా చర్చించిన నాల్సా పథకాలు..:** నాల్సా గిరిజనుల హక్కుల పరిరక్షణ పథకం 2015 గిరిజనుల భూమి, అటవీ హక్కులు, సాంస్కృతిక హక్కుల రక్షణ మరియు చట్టపరమైన సాయం అందించడం. నాల్సా వయోవృద్ధుల న్యాయ సేవల పథకం 2016 సీనియర్ సిటిజన్లకు రక్షణ, వారి సంక్షేమం మరియు గౌరవప్రదమైన జీవన హక్కుపై అవగాహన. కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలు (అటవీ, రెవెన్యూ, ఐటీడీఏ, వైద్య, విద్యా, పోలీసు, స్త్రీ శిశు సంక్షేమం, వ్యవసాయ శాఖ మొదలైనవి) ఏర్పాటు చేసిన స్టాళ్లను అధికారులు, న్యాయమూర్తులు సందర్శించారు. విద్యార్థులు, గిరిజన కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా అదనపు జడ్జి ఎం. బాలాజీ నాయక్, సబ్ డివిజనల్ పోలీసు అధికారి యు. నాగరాజు, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకట శివరామిరెడ్డి, అదనపు సివిల్ జడ్జి రామకృష్ణ, సీనియర్ సివిల్ జడ్జి బి. దేవేంద్ర రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గిరిజన సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# అంగన్వాడీ సిబ్బందికి నియామక పత్రాలు అందించిన ఎమ్మెల్యే ఇంటూరి

**–కేంద్రాల ద్వారా చక్కటి సేవలు అందించాలని సూచన**



**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 19**

నియోజకవర్గంలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో ఇద్దరు టీచర్లు, 21 మంది ఆయా పోస్టులకు కొత్తవారిని నియమించగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వారందరినీ అభినందిస్తూ, శనివారం కందుకూరులోని తన కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. రాబోయే తరం శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండేలా... గర్భిణీలకు, బాలింతలకు చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందించాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు వారికి సూచించారు. అంగన్వాడి కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అక్కడికి వచ్చే పిల్లలను సొంత బిడ్డల్లాగా చూసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమానికి సిడిపివోలు ఉషారాణి, మాధవిలత, పలువురు నాయకులు హాజరయ్యారు.

# ప్రజా దర్బార్‌లో సమస్యల పరిష్కారం

**ఎమ్మెల్యే ముత్తుముల**




**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 19**

గిద్దలూరు పట్టణం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి " ప్రజా సమస్యల పరిష్కార వేదిక " కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటు చేశారు, కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ , పట్టణ ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యే కు తెలిపారు అందులో కొన్ని సమస్యలను అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించగా, మిగిలిన సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దూర ప్రాంతాల వారిని ఉద్దేశించి వారి వద్దకే అధికారులు వచ్చి సమస్యలు తెలుసుకొని పరిష్కరించేలా కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి పేద ప్రజలకు అన్ని విధాలుగా సహకారం అందించేందుకు కట్టుబడి ఉన్నారని "ప్రజల వద్దకే పాలన" అనే ఉద్దేశంతో నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, కూటమి నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొనీ అర్జీలు అందించారు.

# వర్షా భావ పరిస్థితులు నెలకొన్నాయి

**నీటిని వృదా చేయవద్దుచేయ అవసరం మేరకే వినియోగిచుకోవాలి**

**ఎంపీపీ అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం**



**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 19**

మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం రాచర్ల ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ షేక్ ఖాసింభి అధ్యక్షతన, ఎంపీడీఓ వెంకట రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొని తమ శాఖల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, కొనసాగుతున్న పనుల పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలపై సభ్యులకు వివరించారు. మండలంలోని పలు సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గి భూగర్భ జలాలు అడుగంటిపోయే అవకాశం ఉందన్నారు. ప్రజలు నీటి ప్రాధాన్యతను గుర్తించి బోర్ల వద్ద అవసరమైన మేరకే నీటిని వినియోగించుకోవాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ పొదుపుగా వినియోగించాలని కోరారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్ బాషా, పలువురు ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సంస్కృతి లో అంగరంగ వైభవంగా వినాయక చవితి నిమజ్జన వేడుకలు

**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 19**

పట్టణంలోని గుర్రంవారిపాలెంలో ఉన్న శ్రీ సంస్కృతి స్కూల్‌లో వినాయక చవితి నిమజ్జన వేడుకలు ఘనంగా, అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాలలో ప్రతిష్ఠించిన వినాయకుడిని ఐదు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, కార్యక్రమాలతో ఆరాధించి, ఐదవ రోజున ఘనంగా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిమజ్జనానికి ముందు వినాయకుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, గజహారతి ఇచ్చి, గజమాలతో అలంకరించి భక్తిశ్రద్ధలతో నిమజ్జన ఊరేగింపును ప్రారంభించారు. ఈ నిమజ్జన వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు వివిధ రకాల కోలాటాలు, నృత్యాలు ప్రదర్శిస్తూ, గణపతి పాటలు, అయ్యప్ప స్వామి భక్తిగీతాలు, ఇతర దేవతా గీతాలతో భక్తి వాతావరణాన్ని మరింత శోభాయమానంగా మార్చారు. విద్యార్థుల ఆనందోత్సాహాలు, భక్తి గీతాలు, రంగుల సందడి నిమజ్జన వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నిమజ్జన ఊరేగింపు సాగుతున్న మార్గంలో భక్తులకు పులిహోర, పొంగలి ప్రసాదాలను పంపిణీ చేశారు. రంగులతో ఆనందాన్ని పంచుకుంటూ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని వేడుకను మరింత వైభవంగా మార్చారు. సాంప్రదాయబద్ధంగా, భక్తి శ్రద్ధలతో గణనాథుడిని ఘనంగా సాగనంపారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కొంకా చంద్రశేఖర్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో భక్తి, సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడం కోసమే ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఐదు రోజుల పాటు భక్తితో పూజలందుకున్న విఘ్నేశ్వరుడు... ఐదవ రోజున ఆనందోత్సాహాల మధ్య నిమజ్జనంతో వీడ్కోలు అందుకున్నారు. భక్తితో



ప్రారంభమైన వినాయక చవితి వేడుకలు, ఐక్యత ఆనందంతో ఘనంగా ముగిశాయి. గణనాథుని ఆశీస్సులు ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు, సౌభాగ్యం, విజయాలను నింపాలని శ్రీ సంస్కృతి స్కూల్ కుటుంబం



ఆకాంక్షించింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన పాఠశాల చైర్మన్ కొంకా చంద్రశేఖర్ కి, వైస్ ప్రిన్సిపల్ శోభారాణి కి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులకు పాఠశాల తరపున ప్రిన్సిపల్ హరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఆక్స్‌ఫర్డ్‌లో ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు





**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 19**

బిఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో కందుకూరులో వినాయక చవితి నిమజ్జన వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యాసంస్థల్లో ప్రతిష్ఠించిన గణనాథుడికి ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. నిమజ్జనానికి ముందు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, హారతి సమర్పించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొనగా భక్తి గీతాలు, గణపతి పాటలు, అయ్యప్ప స్వామి భక్తిగీతాలు తదితర పలు పాటలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వినాయక నిమజ్జన ఊరేగింపులో విద్యార్థినీ,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని భక్తి పాటలతో సందడి చేశారు. ఊరేగింపు మార్గంలో భక్తులకు ప్రసాదాల పంపిణీ చేపట్టారు. భక్తి,సంప్రదాయం, సాంస్కృతిక కార్యక్రమాల సమ్మేళనంతో నిమజ్జన వేడుకలు వైభవంగా కొనసాగాయి. ఈ కార్యక్రమంలో బి.ఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు జి. బాల భాస్కరరావు,బి. నరేంద్ర బాబు, పాఠశాల, ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థినీ,విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో భక్తి భావంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థల ప్రతినిధులు తెలిపారు. ఐదు రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడిని భక్తిశ్రద్ధలతో సాగనంపుతూ, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు, సౌభాగ్యం, విజయాలు కలగాలని ఆకాంక్షించారు.

# భార్యాభర్తల బంధం తెగినా.. మానవత్వం వీడని భర్త

**సంతమాగులూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 19**

భార్యాభర్తల మధ్య విభేదాలతో కొంతకాలంగా వేరుగా ఉంటున్నప్పటికీ, భార్య మృతి తర్వాత రాగద్వేషాలకు తావులేకుండా ఆమెకు అంతిమ సంస్కారాలు నిర్వహించి భర్త మానవత్వాన్ని చాటుకున్న ఘటన సంతమాగులూరు మండలం సజ్జాపురంలో చోటుచేసుకుంది. సజ్జాపురానికి చెందిన బైరెడ్డి నాగలక్ష్మి (32) ఎలుకల మందు తాగి చికిత్స పొందుతూ సెప్టెంబర్ 18న నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో మృతి చెందింది.



**విభేదాలతో దూరమైన భార్య**

నాగలక్ష్మికి వెంకటసుబ్బారెడ్డితో 13 సంవత్సరాల క్రితం వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా కుటుంబ విభేదాలతో ఆమె భర్తకు దూరంగా ఉంటున్నట్లు సమాచారం. మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందన్న ఆరోపణల నేపథ్యంలో సెప్టెంబర్ 13న సదరు వ్యక్తి ఇంటి వద్ద ఆమె ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స పొందుతూ మృతి చెందడంతో మృతదేహాన్ని స్వీకరించే విషయంలో తొలుత సందిగ్ధత ఏర్పడింది.

**పెద్దల సూచనతో చివరి కర్తవ్యం..:** అనంతరం గ్రామ పెద్దలు, ఇరువర్గాల కుటుంబ సభ్యుల సంప్రదింపుల మేరకు వెంకటసుబ్బారెడ్డి భార్యకు చివరి కర్తవ్యాలు నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం తదితర ప్రక్రియలు పూర్తయిన అనంతరం మృతదేహాన్ని సజ్జాపురంలోని తన ఇంటికి తీసుకొచ్చి హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు.

**అల్లుడి ఔదార్యాన్ని కొనియాడిన తండ్రి**

నాగలక్ష్మి తండ్రి సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. భార్యాభర్తల మధ్య విభేదాలు ఉన్నప్పటికీ చివరి సమయంలో తమ అల్లుడు చూపిన ఔదార్యం గొప్పదన్నారు. కుటుంబ సంప్రదాయాలను గౌరవిస్తూ కుమార్తెకు అంతిమ సంస్కారాలు నిర్వహించడం అభినందనీయమని, ఇలాంటి సమయంలో మానవత్వానికి ప్రాధాన్యం ఇచ్చిన అల్లుడు తమకు దొరకడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. నాగలక్ష్మి మృతితో ఇద్దరు పిల్లలు తల్లిని కోల్పోవడం కుటుంబంలో విషాదాన్ని నింపింది. భార్యాభర్తల మధ్య బంధం బలహీనపడినా.. చివరి సమయంలో మానవత్వాన్ని నిలబెట్టిన వెంకటసుబ్బారెడ్డి తీరు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలకు పూర్వ వైభవం

**గతంలో మరుగునపడ్డ వైద్యశాల**

**మాజీ జెడ్పిటిసి చింతా రామారావు, రిటైర్డ్ పంచాయతీ సెక్రెటరీ చింతా వెంకయ్య సహకారంతో మంత్రి దృష్టికి**

**మంత్రి చొరవతో మెరుగైన సదుపాయాలు**

**సంతమాగులూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 19**

మండలంలోని వెల్లలచెరువు గ్రామంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలకు పూర్వ వైభవం ఏర్పడింది. ఒకప్పుడు గ్రామంలో ఆయుర్వేద వైద్యశాలలో గ్రామస్తులు, చుట్టుపక్క గ్రామాల నుండి కూడా ప్రజలు వచ్చి తగు వైద్యం చేయించుకునేవారు. ఇటీవల గత ప్రభుత్వంలో ఆయుర్వేద వైద్యశాలకు సరైన సదుపాయాలు, వైద్యులు లేక ప్రజలు ఆయుర్వేద వైద్యశాలను మరిచారు. స్థానిక గ్రామానికి చెందిన మాజీ జెడ్పిటిసి చింతా రామారావు, రిటైర్డ్ పంచాయతీ సెక్రటరీ చింతా






వెంకయ్య సమస్యను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ బి మహదేవ్ ను నియమింప చేశారు. ఆయుర్వేద వైద్యశాలలో కావలసిన వైద్య సదుపాయాలను కల్పించి పూర్వ వైభవం తీసుకొచ్చారు. ప్రస్తుతం గ్రామస్తులు వైద్యశాలకు వెళ్ళి చికిత్స పొందుతున్నారు. డాక్టర్ బి.మహదేవ్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానని, బిపి, షుగర్, జలుబు,దగ్గు, కీళ్ల నొప్పులు, మూత్రనాల సంబంధిత ఇన్ఫెక్షన్లు, జీర్ణ సమస్యలు, చర్మ సమస్యలు, మొలలు, ఫిషర్స్ నివారణకు మెరుగైన మందులు ఉన్నాయని, ప్రజలు కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి వేల సంఖ్యలో నగదును ఖర్చు చేసుకోవద్దని ఆయన సూచించారు. ప్రజలు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

# ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు 53 పోలింగ్ కేంద్రాలు



**పుల్లల చెరువు పెన్ పవర్ సెప్టెంబర్ 19**

త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పుల్లలచెరువు మండలంలో పోలింగ్ కేంద్రాల తుది జాబితాను అధికారులు సిద్ధం చేశారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 53 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో మరియదాసు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆమోదం మేరకు పోలింగ్ కేంద్రాల తుది జాబితాను సిద్ధం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలించేందుకు వీలుగా జాబితాను ఎంపీడీవో కార్యాలయంలోని నోటీసు బోర్డులో ప్రదర్శించినట్లు వివరించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చక్రవర్తి, స్వర్ణ గ్రామ కార్యాలయ అధికారి హనుమంతరావు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# జాయింట్ కలెక్టర్‌ను కలిసిన బీజేపీ బృందం



**మార్కాపురం పెన్ పవర్ సెప్టెంబర్ 19**

జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరావును బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో బీజేపీ బృందం కలిసింది. కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లా అభివృద్ధిపై ఈ సందర్భంగా చర్చించారు. జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, పరిశ్రమలు స్థాపించేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని బీజేపీ నేతలు కోరారు. దీనిపై జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి, నిరుద్యోగ యువత వివరాలు అందిస్తే పరిశీలించి అర్హులకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కొత్తగా ఏర్పడిన బీజేవైఎం జిల్లా కమిటీని జాయింట్ కలెక్టర్ కు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మల్లెల, గౌన్స్ ఎక్కలి, కమల్ గుప్తా, జీవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 19**

విద్యుత్ సరఫరాలైన్స్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలునుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఆదివారం అత్యవసర మరమ్మతులు కారణంగా పొట్టి శ్రీరాములు సెంటర్, ఎల్లావారి విధి , బంగారు షాపుల విధి , ఓల్డ్ కోటక్ బ్యాంకు రోడ్ , అంటి హోటల్ మెయిన్ బజార్ సుంకమ్మ బజార్ , యాదవ్ బజార్ , ప్రశాంత్ నగర్ , గారె వారి విధి , కొప్పు వారి విధి, మెయిన్ లైన్ లో పలు చోట్ల కరెంట్ అంతరాయం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని , విద్యుత్ వినియోగదారులు సహకరించవలసింది గా విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.



# 21న కొమరోలులో నూతన సిమెంట్ రోడ్లు,నూతన స్వర్ణ గ్రామ కార్యాలయానికి ప్రారంభోత్సవం చేయనున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక రెడ్డి

### కార్యక్రమాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్న ముత్తుముల సంజీవరెడ్డి,,బోనేని వెంకటేశ్వర్లు యాదవ్





**కొమరోలు పెన్ పవర్ సెప్టెంబరు 19**

గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఈనెల 21వ సోమ వారం ఉదయం 10 గంటలనుండి కొమరోలు మండలంలో పర్యటించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేయనున్నారని కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి,కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ తెలిపారు. కొమరోలు పట్టణంలో ఇటీవల నూతనంగా ఏర్పాటుచేసిన సిమెంట్ రోడ్లకు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ప్రారంభోత్సవం చేయనున్నారని వారు తెలిపారు. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సహకారంతో, ఆయన ప్రభుత్వం ద్వారా విడుదల చేయించిన నిధులతో కొమరోలు పట్టణంలోని ఇస్లాంపేటలో ని గుట్ట సమీపంలో నూతనంగా సిమెంట్ రోడ్డును నిర్మించారు. కొమరోలు లోని ఆర్ అండ్ బి రోడ్డు వద్ద నుంచి తాతిరెడ్డిపల్లికి వెళ్లే రోడ్డు లో శివాజీ నగర్ సరిహద్దు వరకు నూతన సిమెంట్ రోడ్డు నిర్మించారు.. కొమరోలు లోని మండల పరిషత్ కార్యాలయం వద్ద నుంచి ట్రాన్స్కో కార్యాలయం మీదుగా గోపానిపల్లి లోని బీసీ బాలుర హాస్టల్ వరకు గల గ్రావెల్ రింగ్ రోడ్డును భారీ నిధులతో సిసి రోడ్డుగా అభివృద్ధి చేశారు. సదరు మూడు సిమెంట్ రోడ్లకు ప్రారంభోత్సవం చేయడంతో పాటు, రాజు గారి కోట సమీపంలో గతంలో నిర్మించిన స్వర్ణ గ్రామ 3 నూతన భవనానికి కూడా అశోక్ రెడ్డి సోమవారం ప్రారంభోత్సవం చేయనున్నారని వారు తెలిపారు. కావున కొమరోలు మండలంలోని తెలుగుదేశం,జనసేన, భారతీయ జనతా పార్టీ నేతలు,కార్యకర్తలు అభిమానులు, తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జీలు, కోఆర్డినేటర్లు, వివిధ పదవులలో ఉన్న తెలుగుదేశం పార్టీ నేతలు అధిక సంఖ్యలో పాల్గొని శాసనసభ్యులు అశోకు రెడ్డి పర్యటన కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ప్రజలు నీటి ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలి

### అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల సంఖ్యను పెంచండి
### మరమ్మతులకు వచ్చిన బోర్లను, నీటిమట్టం పడిపోయిన బోర్లను గుర్తించాలి
### అధికారులతో కీలక సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే ముత్తుముల




**గిద్దలూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 19**

గిద్దలూరు పట్టణంలో తీవ్రంగా నెలకొన్న నీటి ఎద్దడి సమస్యకు తక్షణ పరిష్కారం చూపేందుకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్, రమణ బాబు , సంబంధిత అధికారులు, టీడీపీ పట్టణ ప్రముఖులు, నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పట్టణంలోని నీటి సరఫరా పరిస్థితి, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, ఎండిపోయిన బోర్లు, మరమ్మతులకు గురైన బోర్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను పెంచడంతో పాటు ఎండిపోయిన, మరమ్మతులకు గురైన బోర్లను గుర్తించి సాధ్యమైనంత త్వరగా మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించడమే ప్రధాన లక్ష్యమని అందుకు కూటమి ప్రభుత్వం ముందు ఉంటుందని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి స్పష్టం చేశారు.

## నూతన ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల మంజూరుకు 1,108 దరఖాస్తులు

### సామాజిక పెన్షన్ల దరఖాస్తుకు ముగిసిన గడువు



**కొమరోలు పెన్ పవర్ సెప్టెంబర్ 19**

నూతన ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ కొమరోలు మండలంలోని పలు గ్రామాల నుంచి 1,108 మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారని కొమరోలు ఎంపీడీవో రమేష్ బాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు నూతన ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను మంజూరు చేయుటకు దరఖాస్తులను ఆహ్వానించింది.ఈ నెల 7వ తేదీ నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరణకు నిర్ణయించారు. మేరకు లబ్ధిదారులు స్వర్ణ గ్రామ కార్యాలయాల్లో తమ దరఖాస్తులను అందజేశారని ఆయన తెలిపారు.వృద్ధాప్యపు పెన్షన్లను మంజూరు చేయాలని కోరుతూ 504 మంది దరఖాస్తు చేసుకున్నారని, వితంతువు పెన్షన్ల కొరకు 173 మంది, వికలాంగుల పెన్షన్ల కొరకు 264 మంది, ఒంటరి మహిళ పెన్షన్ల కొరకు ఇద్దరు, చర్మకారుల పెన్షన్ల కొరకు 109 మంది,మత్స్యకారుల పెన్షన్ల కొరకు ముగ్గురు, డప్పు కళాకారుల పెన్షన్ల కొరకు 51 మంది దరఖాస్తులు చేసుకున్నారని ఆయన తెలిపారు. అందిన దరఖాస్తులను ఆన్లైన్లో పొందుపరిచి, ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్లుగా ఎంపీడీవో రమేష్ బాబు తెలిపారు.

# వైసీపీలో నయా జోష్ - కేడర్‌కు దిశానిర్దేశం చేసిన అన్నా

- ఉదయం టౌన్ నేతలతో.. సాయంత్రం రూరల్ నాయకులతో సమావేశం
- పార్టీ బలోపేతంపై కీలక చర్చ, క్షేత్రస్థాయిలో దూసుకుపోవాలని పిలుపు
- వచ్చే ఎన్నికల్లో విజయం మనదే, సమన్వయంతో పని చేయాలని సూచన






**మార్కాపురం, పెన్ పవర్, సెప్టెంబర్ 19**

మార్కాపురం వైఎస్ఆర్సీపీ కార్యాలయంలో శనివారం రోజంతా రాజకీయ హడావిడి నెలకొంది. మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశాలు జరిగాయి. ఉదయం మార్కాపురం పట్టణ నాయకులు, కార్యకర్తలతో, సాయంత్రం రూరల్ మండల నాయకులు, కార్యకర్తలతో వేర్వేరుగా సమావేశమై పార్టీ పరిస్థితిపై చర్చించారు.

**పార్టీ బలోపేతం.. క్షేత్రస్థాయి కార్యక్రమాలపై దృష్టి..**

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త పార్టీకి వెన్నెముక లాంటి వారని, అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవాలని, వైఎస్ఆర్సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు.

**స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యం..**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలని అన్నా రాంబాబు స్పష్టం చేశారు. మార్కాపురం మున్సిపల్ ఎన్నికలు, గ్రామ పంచాయతీ, జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో వైఎస్ఆర్సీపీ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి, ప్రతి వార్డులో, ప్రతి పంచాయతీలో పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేస్తే అన్ని స్థానాలను వైఎస్ఆర్సీపీ కైవసం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో విజయం మనదేనని కార్యకర్తల్లో భరోసా నింపారు. ఈ సమావేశాలకు మార్కాపురం పట్టణ, రూరల్ మండలాలకు చెందిన వైఎస్ఆర్సీపీ ముఖ్య నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నీట్ సెంట్రల్ ర్యాంకు 976 విద్యార్థినికి వాసవి జాగృతి అభినందనలు



**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 19**

గిద్దలూరు మండలం కృష్ణం శెట్టి పల్లె గ్రామం కోట సురేష్ కుమార్తె కోట వెంకటసుబ్బ సాయి లక్ష్మీ వైష్ణవి కి నీట్ సెంట్రల్ ర్యాంకు 976 సాధించిన సందర్భంగా వాసవి జాగృతి మిత్రమండలి ఆధ్వర్యంలో శనివారం ప్రతిభా పురస్కారం అందజేసి ఘనంగా సన్మానించారు. ఆర్యవైశ్యులలో నీట్ కులక్ష్మీ వైష్ణవి ప్రతిభకు నిదర్శనమని వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ సహకారి ఛైర్మన్ సూరే చెంచయ్య తెలిపారు. సన్మానం కార్యక్రమంలో ఐసీసీ ఆఫీసర్ ఆర్యన్ బాదం వెంకటేశ్వర్లు, అధ్యక్షులు నాదెళ్ళ వంశీకృష్ణ, సెక్రటరీ కొప్పరపు నాగేశ్వరరావు, ట్రెజరర్ కామిశెట్టి వెంకటనారాయణ, కళ్యాణమస్తు ఇంచార్జ్ శివపురం రమేష్ బాబు, గర్రె పుల్లయ్య, గర్రె వెంకటేశ్వర్లు, గర్రె వెంకట సుబ్బారావు, మునగనూరి సత్యనారాయణ మరియు ఆర్యవైశ్య ప్రముఖులు అందరూ హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎస్సీ హాస్టల్ ను తనిఖీచేసిన ఎంపీడీఓ మల్లికార్జునరావు




**గుడ్లూరు, పెన్ పవర్, సెప్టెంబరు 19:**

వన్ ఇన్స్టిట్యూషన్ వన్ ఆఫీసర్ అనే కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీవో మల్లికార్జునరావును ఎస్సీ బాయ్స్ హాస్టల్, గుడ్లూరు నకు స్పెషల్ ఆఫీసర్ గా నియమించబడిఉన్నారు. ఈ సంధర్భంగా ఎంపీడీఓ మల్లికార్జున రావు, ఎంఇఓ గోవర్ధన్ తో కలసి గుడ్లూరు ఎస్.సీ బాయ్స్ హాస్టల్ ను శనివారం సాయంత్రం సందర్శించారు. అనంతరం అక్కడి విద్యార్థులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ లో ఉన్నటువంటి ఆర్.ఓ ప్లాంట్ ను పరిశీలించి, వాటర్ ను తాగి చూశారు. వంట గదిని, వాష్ రూమ్స్ ను, విద్యార్థుల నివాసం ఉంటున్నటువంటి గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేయడం జరిగిందని ఎంఇఓ తెలియజేశారు. తదనంతరం భోజనం మేనూ పరిశీలిస్తున్నప్పుడు బుధవారం రోజు వడ్డిస్తున్న జీలకర్ర అన్నము ఎక్కువ మందికి ఇష్టం లేదని, దానికి బదులుగా వైట్ రైస్ వడ్డించవలసిందిగా విద్యార్థులు కోరగా, దానికి ఎంపీడీవో సానుకూలంగా స్పందించి వంట వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జునరావు, ఎంఇఓ ఎం.గోవర్ధన్ తో పాటు హాస్టల్ వార్డెన్ తదితరులు పాల్గొన్నారు.

## డ్వామా ఇన్చార్జి పి.డి.గా ఎం.వెంకటేశ్వరరావు



**ఒంగోలు టౌన్, పెన్ పవర్ సెప్టెంబర్ 19**

డ్వామా ఇన్చార్జి పి.డి.గా ఎం.వెంకటేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రాజెక్టు డైరెక్టర్ జోసఫ్ కుమార్ వ్యక్తిగత అవసరాల దృష్ట్యా సెలవు పెట్టడంతో వెంకటేశ్వరరావు ఇన్చార్జిగా బాధ్యతలు చేపట్టారు.

## గణనాథుడికి ఇమ్మడి కాశీనాథ్ ప్రత్యేక పూజలు




**మార్కాపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 19**

పట్టణంలో వినాయక నిమజ్జనాలను పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో జనసేన పార్టీ మార్కాపురం జిల్లా కీలక నాయకుడు ఇమ్మడి కాశీనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు.పట్టణంలో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాల వద్ద నిర్వహించిన పూజల్లో ఆయన పాల్గొని, మార్కాపురం ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, జిల్లా అభివృద్ధి చెందాలని స్వామి వారిని కోరారు. అనంతరం నిమజ్జనానికి వెళ్తున్న గణనాథులకు హారతులు ఇచ్చి వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థాన పాలక మండలి సభ్యుడు, జనసేన నాయకుడు విజయరావు నరసింహారావు, జనసేన నాయకులు ఉమ్మడి రవీంద్ర, పిన్నెబోయిన శ్రీనివాసులు, ఇ. పిచ్చయ్యతో పాటు పలువురు జనసేన కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో గాయత్రీ యజ్ఞం...

**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 19**

గిద్దలూరు పట్టణంలోని యాల్లా వారి వీధిలోని వినాయక మండపంలో శనివారం గాయత్రీ పరివారం ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో శ్రీమాత గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. వినాయక మండపం నిర్వాహకులు కనుమర్లపూడి శివశంకర్ దంపతులు ప్రధాన యజ్ఞ కర్తలుగా వ్యవహరించారు. యజ్ఞం అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. గాయత్రీ పరివార్ సభ్యులు మునగనూరి ప్రసాద్, కె.హరనాథ్ బాబు, వినాయక మండపం నిర్వాహకులు నిరంజన్ రెడ్డి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్య పరిరక్షణ పై అవగాహన కార్యక్రమం

**పొన్నలూరు పెన్ పవర్ ,సెప్టెంబర్ 19**

మండల కేంద్రమైన పొన్నలూరు, కల్లూరి వారి పాలెం బాలిరెడ్డిపాలెం ముండ్లమూరివారిపాలెం గ్రామాలలో శనివారం పోషణ మాసోత్సవాలు పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ రిజ్వానా మాట్లాడుతూ పోషకాలు మెండుగా ఉండే చిరుధాన్యాలు తీసుకోవడం వలన విటమిన్లు ప్రోటీన్లు ఖనిజ లవణాలు లభిస్తాయని తెలిపారు. ఇంటిలో వండిన



ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని తెలిపారు. గర్భిణీలు,బాలింతలు, చిన్నారులు,కిశోర బాలికలకు సమతుల్య ఆహారం పోషకాహారం పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు మధురవాణి వై ఉష చిన్నమ్మ వసంతకుమారి బాలసుధ అంజమ్మ శ్రీదేవి మస్తానమ్మ గర్భిణీలు పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# సమతుల పౌష్టికాహారంతో జీవితకాల ఆరోగ్యం

**సూపర్వైజర్ కామేశ్వరి**





**గుడ్లూరు, పెన్ పవర్, సెప్టెంబరు 19**

సమతుల్యమైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా శరీక దృఢత్వాన్ని పొందవచ్చునని మరియు అనేక దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేసుకోవడమే కాకుండా జీవితకాల ఆరోగ్యం పొందవచ్చునని సూపర్వైజర్ కె.కామేశ్వరి అన్నారు. మండలంలోని తెట్టు సెక్టార్ కర్లపాలెం అంగన్వాడి సెంటర్ లో 9వ పోషకార మాసోత్సవాలు ఉలవపాడు ప్రాజెక్టు సీడీపీఓ మాధవీలత ఆదేశాలు మేరకు సూపర్వైజర్ కామేశ్వరి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తల్లులు, గర్భవతులు, బాలింతలు, కిషోరీ బాలికలు ఇతర గ్రామస్తులు అందరికీ పౌష్టికాహారం గురించి అవగాహన తెలియజేయడమైనదని సూపర్వైజర్ అన్నారు. మనం తీసుకునే ఆహారంలో పోషక విలువలు కలిగినటువంటి ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు, పాలు, పాల పదార్థాలు, చిరుధాన్యాలు తీసుకోవాలని తెలియజేశారు. ఎక్కువగా కరివేపాకు, మునగాకు ఇలాంటివి ఆకుకూరలు ఎక్కువ వాడాలన్నారు. ఆహారంలో వైవిధ్యం ఉండేటట్టుగా చూసుకోవటం ప్రోటీన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలు ప్రాంతీయ వంటకాలు మరియు ఆరోగ్యకరమైన ఆహార పలవాట్లపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రంలో, ఇంటిదగ్గర, నూనెలు చక్కెర ఉప్పు కూల్డ్రింక్స్ వంటి వాటిపై అవగాహన కలిగించటమైనదని సూపర్వైజర్ కామేశ్వరి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం అనిత, ఆశా వర్కర్ కార్యకర్త సిహెచ్ సుభాషిణి, విజయ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# శివారు ప్రాంతాలను కూడా అభివృద్ధి చేస్తాం

**ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**





**మార్కాపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 19**

పట్టణంలోని శివారు ప్రాంతాలను కూడా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని 14వ వార్డు శివారు ప్రాంతం చెన్నారాయుడుపల్లిలో శనివారం పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. 15 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణానికి, 8 లక్షల రూపాయలతో నూతన తాగునీటి ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎన్నో ఏళ్లుగా పాడుబడి శిథిలావస్థకు చేరిన పాత నీటి ట్యాంకు స్థానంలో స్థానికుల కోరిక మేరకు కొత్త ట్యాంకు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన మార్కాపురంలోని ప్రతి వార్డును అభివృద్ధి చేస్తామని, అందులో భాగంగానే చెన్నారాయుడుపల్లిలో 23 లక్షల రూపాయల పనులకు శంకుస్థాపన చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, టిడిపి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఘాతానికి వ్యక్తి దుర్మరణం

**పొదిలి, పెన్ పవర్, సెప్టెంబర్ 19**



విద్యుత్ ఖాతానికి ఒక వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన జరిగింది. మండలంలోని మూగచింతల గ్రామానికి చెందిన బండారు సుబ్బారావు అనే వ్యక్తి శనివారం నాడు తన పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగిలి అక్కడికక్కడే మరణించారు.

# ఒంగోలులో ఆవిష్కృతమైన చారిత్రాత్మక ఘట్టం

**ఎమ్మెల్యే దామచర్ల సంకల్పం - నగర ప్రజల అద్భుత సహకారం**

**వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ లో చేరిన మెగా సిగ్గేషన్ డ్రైవ్**

**150 సంవత్సరాల ఒంగోలు మునిసిపాలిటి ఘన చరిత్రను చాటి చెప్పేలా కార్యక్రమాలు - జిల్లా కలెక్టర్ పి.రాజా బాబు**

**ఈ నెల 28, 29 30 తేదీల్లో పలు కార్యక్రమాలను విజయవంతం చేయాలి - ఎంపీ మాగుంట పిలుపు**

**ఒంగోలు అభివృద్ధిలో ఇది ఆరంభం మాత్రమే - ఎమ్మెల్యే దామచర్ల**


















**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ సెప్టెంబర్ 19**

ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఒంగోలు మునిసిపాలిటీ చరిత్రను ఘనంగా చాటి చెప్పేలా పలు కార్యక్రమాలను సంకల్పించారు. అందులో భాగంగా ఒంగోలు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం మెగా సిగ్రిగేషన్ డ్రైవ్ తలపెట్టారు. ఒక గంటలో నగర పాలక సంస్థ సిబ్బంది ప్రజల సహకారంతో 80,318 (ఎనభై వేల మూడు వందల పద్దెనిమిది) గృహాల నుంచి తడి.. పొడి చెత్తను విజయవంతంగా వేరుచేసి సేకరించి బృహత్తర కార్యక్రమాన్ని అనుకున్న సమయానికి అనుకున్న విధంగా దిగ్విజయంగా పూర్తి చేశారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సౌత్ రీజియన్ (ఇండియా) జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఉల్లాజ్ ఎలైజర్ చేతులు మీదుగా అధికారికంగా ధ్రువీకరణ పత్రాన్ని ఒంగోలు మునిసిపల్ కమిషనర్ తుమ్మల వెంకట కృష్ణయ్య అందుకున్నారు. ఇది ఒక చారిత్రాత్మక ఘట్టం. ఈ సందర్భంగా ఒంగోలు నగరంలోని కబాడీపాలెం, గానుగ పాలెం, ఆంధ్రకేసరి నగర్, గాంధీ నగర్, కొత్త మామిడి పాలెం డంపింగ్ యార్డ్ వద్ద మెగా సేగ్రిగేషన్ డ్రైవ్ లో జిల్లా కలెక్టర్ పి రాజా బాబు, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసుల రెడ్డి, స్థానిక శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.రాజా బాబు మాట్లాడుతూ ఈనెల 30 వ తారీఖుతో ఒంగోలు మున్సిపాలిటీ ఏర్పడి 150 సంవత్సరాలు పూర్తీ అవుతున్న నేపథ్యంలో ఆ ఘన చరిత్ర అందరికి తెలియజేసేలా అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు. పట్టణంలోని సుమారు 81,000 గృహాలకు తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే బ్యాగులు అందచేయడం జరిగిందన్నారు. స్థానిక శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ రావు పిలుపు మేరకు కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా ఉందన్నారు. అందరికి ఈ మెగా డ్రైవ్ తడి చెత్త పొడి చెత్త వేరు చేసే విధానం తెలిసిందన్నారు. ఒంగోలు- మన గౌరవం నినాదంతో పలు కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఒంగోలు మునిసిపాలిటీ ఏర్పాటై నూటా యాభై సంవత్సరాలు కానున్న నేపథ్యంలో స్థానిక శాసన సభ్యులు , జల్లా కలెక్టర్ చొరవతో ఒక పండుగలా జరపాలని నిర్ణయం తీసుకోవడం చాలా సంతోష దాయకం అని కొనియాడారు. సెగ్రిగేషన్ డ్రైవ్ అనేది ఒక విశిష్టమైన కార్యక్రమం అని అన్నారు. తడి, పొడి చెత్త వేరు చేయడం ప్రయాసతో కూడిన పని అని దానిని సులభతరం చేశారన్నారు. చెత్త నుండి విద్యుత్ సృష్టించడం జరుగుతోందని, ఈ కార్యక్రమములో మహిళల సహకారం చాలా బాగుందన్నారు. ఈనెల 28,29, 30 తేదీలలో పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమాలలో ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. శాసన సభ్యులు దామచర్ల జనార్ధన రావు మాట్లాడుతూ ఒంగోలు మున్సిపాలిటి ఏర్పడి నూటా యాభై సంవత్సాలు పూర్తవుతున్న నేపథ్యంలో గత మూడు నెలల నుండి పలు కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా వివిధ ప్రాంతాలలో సుమారు నూటా యాభై మెడికల్ క్యాంపులు నిర్వహించి ఉచిత వైద్య సేవలు అందించడంతో పాటు ఉచితంగా మందులు అందించడం జరిగిందన్నారు. దాదాపుగా 81,000 వేల గృహాల లో తడి , పొడి చెత్త వేరు చేసే బ్యాగులు అందించడం జరిగిందన్నారు. ఇంకా చాలా మంది కాలువలలో చెత్త వేస్తున్నారని, ఇప్పుడు వేరు చేసే విధంగా అవగాహన పెరిగిందన్నారు. ఈ నెల 27 వ తేదిన సుమారు మూడు వేల మందితో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే 30వ తేదిన భారీగా ఒంగోలు గిత్తల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాలకు ప్రాముఖులు హాజరు కానున్నారన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణలో జిల్లా కలెక్టర్, పార్లమెంట్ సభ్యుల సహకారం గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు శాసనసభ్యులు బి ఎన్ విజయ్ కుమార్, ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ తుమ్మల వెంకట కృష్ణయ్య, పిడిసిసి బ్యాంక్ ఛైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఒంగోలు ఏఎంసీ ఛైర్మన్ రాచగర్ల వెంకట్రావు, ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం. సుచిత్ర వీరయ్య చౌదరి, డిఆర్డిఏ పిడి నారాయణ, మాజీ మేయర్ గంగాడ సుజాత, అబ్జర్వర్ షేక్ న్యామతుల్లా, మునిసిపల్ ఇంజనీరు ఏసయ్య, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ యం.వైష్ణవి, అసిస్టెంట్ కమీషనర్ పి.నగేష్, డిఈఈ లు పద్మజ, శైలజ, అంజిరెడ్డి, శానిటరీ సూపర్వైజర్ నూక తోటి పిచ్చయ్య, మేనేజర్ పి.శ్రీహరి, శానిటరీ ఇన్స్పెక్టర్ లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, సెక్రటరీలు, మాజీ కార్పొరేటర్లు, మునిసిపల్ సిబ్బంది, పాల్గొన్నారు.

# నెమలి గుండ్ల రంగనాయకస్వామిని పోటెత్తిన భక్తులు

**స్వామిని దర్శించుకున్న దేవాదాయధర్మాదాయ శాఖప్రాంతీయ సంయుక్త కమిషనర్ మహేశ్వర్**





**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 19**

రాచర్ల మండలం జేపీ చెరువు గ్రామ సమీపంలో నలమల్ల ఆటవిలో ప్రకృతి సౌందర్యాల మధ్య వెలసిన ఈ ప్రాంత వాసుల ఇలావేల్పుగా కొలుస్తున నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయానికి శనివారం నాడు భక్తులు పోటెత్తారు. స్వామికి రోజువారీ కైంకర్యములో భాగంగా ఉదయం ఐదు గంటలకు స్వామివారికి అభిషేకం అనంతరం స్వామివారిని సుందరంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేశారు, భక్తులకు తీర్థ ప్రసాదములు అందజేశారు . దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ బొంతు మహేశ్వర్ రెడ్డి స్వామినిదర్శించుకున్నారు. దేవస్థానం వద్దకు విచ్చేసి ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులు గురించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు కార్యక్రమము లో దేవస్థానం పాలక మండలి చైర్మన్ సిద్ధం నరసింహులు ఈ ఓ నాగయ్య, దేవస్థానం అర్చక స్వాములు సిబ్బంది తదితరులు పాల్గొని అన్నారు.

# రాచర్ల మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కొరకు 1071 దరఖాస్తులు!!

**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 19**

రాచర్ల మండలంలో ఎన్టీఆర్ భరోసా నూతన పెన్షన్ల కొరకు స్వర్ణ సచివాలయాలలో 1071 దరఖాస్తులు వచ్చాయని ఎమ్ పిడిఓ వెంకట రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు గ్రామాల వారిగా ఆకవీడు -1లో 140,అకవీడు -2 లో 107, అనుమలవీడులో 105 చిన్నగాని పల్లెలో 51 చోళవీడులో 93 గుడిమెట్ల 107 జేపీ చెరువులో 80 రాచర్ల ఒకటిలో 136 రాచర్ల రెండులో 67 సత్యవోలులో 62 సోమిదేవు పల్లెలో 34 ఎడవల్లిలో 47 దరఖాస్తులు అందాయని ఎంపీడీవో వెంకటరామిరెడ్డి తెలిపారు.

# మాలకొండ ఆదాయం రూ.7,03,523

**వలేటివారిపాలెం, పెన్ పవర్ సెప్టెంబర్ 19**

అయ్యవారి పల్లి పంచాయతీ పరిధిలోని మాలకొండ లో వెలిసియున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారికి శనివారం భక్తుల నుండి వివిధ రూపాల ద్వారా రూ 7,03,523 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి శ్రీనివాసులు రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ అర్చకులు, గౌరి శంకర్, నృసింహ చార్యులు స్వామి వారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఆలయానికి దాతల సేవలు అభినందనీయం -ముత్యాల భారతి నారాయణరెడ్డి

**సి.ఎస్.పురం,పెన్ పవర్ సెప్టెంబర్ 18**

మండలంలోని అయ్యలూరివారిపల్లి గ్రామంలో కొలువై ఉన్న లక్ష్మీ గణేశుని ఆలయానికి గ్రామానికి చెందిన ముత్యాల రమణారెడ్డి ధర్మపత్ని నారాయణమ్మ శనివారం భక్తిశ్రద్ధలతో స్వామివారికి వెండి కిరీటాన్ని సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముత్యాల భారతి నారాయణరెడ్డి పాల్గొని దాత కుటుంబాన్ని అభినందించారు ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు మాట్లాడుతూ ఆలయానికి దాత ముత్యాల రమణారెడ్డి దంపతులు వెండి కిరీటాన్ని సమర్పించి దేవస్థాన అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు లక్ష్మీ గణేశుని అనుగ్రహం ముత్యాల రమణారెడ్డి కుటుంబంపై ఎల్లవేళలా ఉండాలని, వారికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముత్యాల రమణారెడ్డి మాట్లాడుతూ లక్ష్మీ గణేశుని స్వామివారికి తమ కుటుంబం తరపున వెండి కిరీటాన్ని సమర్పించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# అక్కినేని స్మృతికి అక్షర నీరాజనం

## నేడు సినీ హీరో అక్కినేని నాగేశ్వరరావు 103వ జయంతి సందర్భంగా అభిమాని బరూరి ప్రత్యేక వ్యాసం






దైవంబుల అమ్మ నాన్నల వంశ.పెద్దల సినీ కళామమాతృదేవత అఖండ ఆశీసుల నిజ.సినీజీవిత వెండితెరల వెన్నెల సుమమాలల కళాభిమానుల మహిళాభిమానుల పెద్దల పిన్నల అక్కినేని.. అభిమాన దైవంబుల ఆనందాల 20..9..1924... 20..9.. 2026...103 వ.వసంతాల పండుగ శుభసమయమున....

సహృదయ.సంస్కార సాంప్రదాయ ధర్మాచరణల మంచిమనసుల ప్రపంచ దర్శిని పుస్తకంబున అలనాటి.. మహానుభావుల మాధ్యంబుల శ్రీఅక్కినేని. మహానుభావుడు. మహానటేశ్వరుడు అని ప్రచురణలో తెలుగు.తల్లి.పుణ్యప్రదంబుల ఏకైక నటసమ్రాట్.. ధర్మపత్నిగా శ్రీసీతారామునిగా నిజ... సినీజీవిత సుమమాలల అన్నపూర్ణ అక్కినేని పుణ్య దంపతుల అఖండ జ్యోతి. ప్రజ్వలనంబుల వెలుగొందుచుండు. ఆచంద్ర తారార్కంబుల సత్యం. శివం. సుందరంబులన్.. బాలరాజు..దేవదాసు.. విప్రనారాయణ.. అన్నపూర్ణ సంస్థ మంచికుటుంబం వీక్షణల చిత్రాల..కళాభిమానుల మహిళాభిమానుల పెద్దల పిన్నల శ్రీఅక్కినేని.మనసేమందిరంబుల ఆరాధనల నిలయంబుల ప్రేమనగర్ .శ్రీఅన్నపూర్ణ నిలయంబుల అభిమాన దైవంబుల మదిశారదేవి మందిరంబుల. కుడిఎడమైనా..సహృదయ.సంస్కార సాంప్రదాయ మనంబుల మరపురాని మరువలేని..అత్యుత్తమ మహానట అఖండ జ్యోతి.ప్రజ్వలనంబుల వెలుగొందుచుండు. ఆచంద్ర తారార్కంబుల అన్నపూర్ణ అక్కినేని పుణ్య దంపతుల అభిమాన ఆనందాల నేడు ఈ శుభకరంబుల.. మహానుభావుల అన్నపూర్ణ అక్కినేని.పుణ్య దంపతులకు మీ అందరి.. మంచిమనసులకు పాదాభి వందనములు.. శుభాకాంక్షలు.

బరూరి సుబ్బరాయ శర్మ రిటైర్డ్ సూపరింటిండెంట్, పోలీస్ కార్యాలయం, ఒంగోలు.

## వినాయక నిమజ్జనానికి భారీ పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు.

- నిమజ్జన ప్రాంతాలను పరిశీలించిన సీఐ, బి తిరుపతిరావు,ఎస్సై జి సతీష్ కుమార్
- ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



**కిర్లంపూడి,పెన్ పవర్, సెప్టెంబర్,19:**వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు.ఇందులో భాగంగా జగ్గంపేట సీఐ, బి తిరుపతిరావు, కిర్లంపూడి ఎస్సై, జి సతీష్ కుమార్ తో కలసి శనివారం కిర్లంపూడి మండలం పాలెం,భూపాలపట్నం గ్రామాల్లో నిమజ్జనం నిర్వహించే ప్రాంతాలను పరిశీలించారు. నిమజ్జన ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.నిమజ్జనానికి వచ్చే భక్తులు,యువతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.నీటి ప్రాంతాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని,నిమజ్జనం సందర్భంగా పోలీసులు చేసే సూచనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ, బి తిరుపతిరావు కోరారు.గణేష్ విగ్రహాల నిమజ్జనాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని,ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సీఐ, బి తిరుపతిరావు కోరారు.నిమజ్జన ప్రదేశాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ,అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు సిబ్బందికి సూచించారు.కిర్లంపూడి ఎస్సై, జి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నిమజ్జనోత్సవాలకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీరంరెడ్డి కాశీబాబు,నీలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అంకంపాలెంలో ఘనంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం



**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 19:**మండలంలో అంకంపాలెం గ్రామంలో స్వచ్ఛతా హీ సేవా, స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి కొత్తపేట డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కె. సురేష్ కుమార్ హాజరై పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించి నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీలు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో పారిశుధ్య పనులు చేపట్టి చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి నిర్దేశిత ప్రదేశాల్లోనే పారవేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత, సురక్షిత తాగునీరు, వ్యర్థాల నిర్వహణపై కూడా అధికారులు సూచనలు చేశారు. అనంతరం డీడీవో పారిశుధ్య కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ నిరంతరం కొనసాగేందుకు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహించి, గ్రామంలో తిరుగుతున్న స్వచ్ఛ రథం పనితీరును పరిశీలించారు.కార్యక్రమంలో కోనసీమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహరావు, ఎంపీడీవో పి.వి.ఆర్.కె. రాజు, డిప్యూటీ ఎంపీడీవో కె. రమేష్ బాబు, అధికారులు, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అక్కినేనితో సన్మానం పూర్వజన్మ సుకృతం

# అక్కినేని అభిమానిగా గర్విస్తున్నా

### - అఖిలభారత అక్కినేని అభిమాని బరూరి సుబ్బరాయ శర్మ






**ఒంగోలు టౌన్, పెన్ పవర్ సెప్టెంబర్ 19**

నట సమ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు అభినయ వేదం... నట నిఘంటువు. అక్కినేని నాగేశ్వరరావు పేరు తలచుకోగానే అభిమానుల్లో ఒక విధమైన పులకరింత. అభినయానికి అక్కినేని పెట్టింది పేరు. తెరపై అక్కినేని అభినయం హావ భావాలు ఆయన వేసే స్టెప్పులు నాటి తరం అభిమానులకు పూనకం తెప్పిచ్చాయి. స్వయం కృషితో పట్టుదలతో సినిమా రంగంలో ఒక్కొక్క మెట్టే ఎక్కుతూ నటనలో తనకు సాటి లేరని నిరూపించుకున్న అక్కినేనిని అణువణువునా ఆరాధిస్తూ ఆయననే తన మనసులో స్మరిస్తూ తరిస్తూ అక్కినేనికి వీరాభిమానిగా జాతీయస్థాయిలో పేరొందిన ఘనత బరూరి సుబ్బరాయ శర్మకు దక్కుతుంది. అక్కినేనికి నిజమైన అభిమానిగా సుబ్బరాయ శర్మనే పేర్కొనాలి. అక్కినేని చేత సన్మానం పొందడం సుబ్బరాయ శర్మ జీవితంలో మరపురాని మధురమైన ఘట్టం. అఖిల భారత అక్కినేని అభిమానిగా సుబ్బరాయ శర్మ తన ఆరాధ్య దైవం అక్కినేనిని స్వయంగా స్వహస్తాలతో సన్మానించి మురిసిపోయారు. అక్కినేని అభిమానిగా సుబ్బరాయ శర్మ పలు సంస్థల సన్మానాలను అందుకున్నారు. హైదరాబాదు అన్నపూర్ణ స్టూడియోలో ప్రముఖ గాయని పి. సుశీల సుబ్బరాయ శర్మను ఘనంగా సత్కరించారు. త్యాగరాయ గానసభలో ఏర్పాటైన మరో కార్యక్రమంలో కూడా సుబ్బరాయ శర్మను నిర్వాహకులు సత్కరించారు .ఇలా పలు సంస్థల సన్మానాలను సుబ్బరాయ శర్మ అందుకున్నారు. అక్కినేని నాగేశ్వరరావు అన్నపూర్ణ పుణ్య దంపతుల అభిమానిగా తన జీవితంలో తాను పొందిన సన్మానాలు అవార్డులు తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చాయని సుబ్బరాయ శర్మ పేర్కొన్నారు. అక్కినేని అభిమానిని అనే ఆనందం తనకు చాలని అదే తనను ముందుకు నడిపిస్తుందని సుబ్బరాయ శర్మ వినయంగా పేర్కొన్నారు. నట సమ్రాట్ అక్కినేని నాగేశ్వరరావును తన ఆరాధ్య దైవంగా గుండెల్లో పెట్టుకొని పూజించే సుబ్బరాయ శర్మ నిజంగా అభినందనీయులు.

## అంగన్ వాడి కేంద్రాల్లోని పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలి

### కొండేపి ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని సుశీల దేవి



**పొదిలి, పెన్ పవర్, సెప్టెంబర్ 19**

అంగన్వాడి కేంద్రా ల్లో చదువుకుంటున్న పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందిం చాలని కొండేపి ఐసి డిఎస్ ప్రాజెక్టు అధికా రిని సుశీల దేవి ఆదే శించారు. శనివారం నాడు మండల కేంద్ర మైన మర్రిపూడి, కాకర్ల సచివాలయాల్లో పోషణ మాసం వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిడిపిఓ సుశీల దేవి మాట్లాడుతూ సెప్టెంబర్ 9వ తేదీ నుండి అక్టోబర్ 8 వరకు పోషణ మాసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అంగన్వాడి కేంద్రాల్లోని పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాల్సి ఉందని, అందుకు వ్యతిరేకంగా జరిగితే బాధ్యులపై చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 25న నగరంలోని పలు ప్రాంతాల్లో మంచినీటి సరఫరాలో అంతరాయం - ఒంగోలు మునిసిపల్ ఇంజనీర్ ఏసయ్య



**ఒంగోలు టౌన్, పెన్ పవర్ సెప్టెంబర్ 19**

ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని పబ్లిక్ హెల్త్ ఆఫీస్ వద్ద గల ఫిల్టర్ బెడ్, రంగారాయుడు చెరువు వద్ద గల ఎలక్ట్రికల్ పోల్స్ వద్ద ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ వారు మరమ్మత్తులు చేయనున్న కారణంగా, ఈనెల 25న మంచినీటి సరఫరా లో అంతరాయం ఉంటుందని ఒంగోలు నగర పాలక సంస్థ ఇంజనీర్ ఏసయ్య శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నగరంలోని చాకలివారి వీధి, ఇందుర్తి నగర్, క్రిస్టియన్ పాలెం, కమ్మ పాలెం, బొల్లినేని వారి పాలెం, రంగుతోట, మరాఠి పాలెం, క్లాపేట, నెహ్రూ నగర్, కోట వీధి, గానుగ పాలెం, బండ్లమిట్ట, గోపాల్ నగర్ 1 నుండి 6 లైన్లు, నీలాయపాలెం, గాంధీ రోడ్డు, ప్రత్తివారి వీధి, భీమరాజు వారి వీధి, దక్షిణం బజార్, ఏనుగు చెట్టు వీధి, కుట్టుబోయిన పాలెం, ఈమని పాలెం, గొడుగు పాలెం, రాజా పానగల్ 11,12 లైన్లు, కర్నూల్ రోడ్డునకు ఉత్తరం.. దక్షిణం వైపు ఉన్న కాలనీలతో పాటు కొత్తపట్నం బస్టాండ్ ప్రాంతాల్లో వారికి మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. 25వ తేదీ న మంచినీటి సరఫరా ఉన్న ప్రాంతాల వారికి తేదీ 28న యథావిధిగా మంచినీటి సరఫరా చేయడం జరిగుతుందని తెలిపారు. కావున పై తెలిపిన ప్రాంతముల వారు ఈ విషయాన్ని గమనించి తేదీ 22న సరఫరా చేయబోయే నీటిని ముందుగానే నిల్వ చేసుకొని పొదుపుగా వాడుకొని నగరపాలక సంస్థకు సహకరించవలసినదిగా ఆయన కోరారు.

## వైభవంగా లక్ష్మీ నరసింహస్వామికి పల్లకి సేవా కార్యక్రమాలు



**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 18**

కేటీఆర్ టెక్నో స్కూల్ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం లో శనివారం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి పల్లకి సేవాకార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. శ్రీ సరస్వతీ అమ్మవారికి మూలా నక్షత్రం సందర్భంగా పంచామృత అభిషేకం వైభవంగా నిర్వహించారు. దేవస్థానం అర్చకులు చోడా వీరభద్రస్వామి పూజలు నిర్వహించి భక్తులుకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు కు దేవస్థానం కమిటీ వారు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షులు కుందురు తిరుపతి రెడ్డి ,శారద దంపతులు, కార్యదర్శి కొప్పరపు సత్యాలు, కోశాధికారి ఉప్పాల నరశింహరావు, ఉపాధ్యక్షులు సింగరాజు మాలకొండేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ ఉప్పాల సుబ్బారావు, కమిటీ సభ్యులు కంబాలదిన్నె శ్రీ నివాసులు, వెంకటరసయ్య, కొలిపాకుల దుర్గా శ్రీనివాసరావు, పెద్దన్న, నున్నా శ్రీ నివాసులు, శ్రీ రాం సురేష్, కుందూరు వెంకటేశ్వరరెడ్డి, నరసింహం తదితరులు పాల్గొన్నారు.

## ఏగిద్దలూరులో రైలు కింద పడి వ్యక్తి మృతి

**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 19**

గిద్దలూరులోని మోడం పల్లె కాలనీ ఎదురుగా జరిగిన విషాద ఘటనలో, తిరుపతి వైపు వెళ్తున్న రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కూరాకువానిపల్లిలో ఘనంగా ముగిసిన వినాయక చవితి వేడుకలు

**వేలం పాటలో 61 వేల రూపాయలకు స్వామి వారి లడ్డును కైవసం చేసుకున్న గంజిగుంట్ల కిరణ్ కుమార్.**

**ఆనందోత్సవాలతో భక్తిశ్రద్ధలతో యువత కేరింతలు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా సాగిన నిమజ్జన శోభాయాత్ర.**

**భక్తి, సంప్రదాయం, గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలిచిన వేడుకలు.**





**కొమరోలు పెన్ పవర్ సెప్టెంబర్ 18**

కొమరోలు మండలం చింతలపల్లి పంచాయతీలోని కూరాకువానిపల్లి గ్రామంలో వినాయక చవితి వేడుకలు ఈ ఏడాది కూడా భక్తిశ్రద్ధలతో, ఎంతో ఘనంగా జరిగాయి.గత కొన్ని సంవత్సరాలుగా కూరాకువానిపల్లి గ్రామ ప్రజలందరూ కలిసి వినాయక చవితి వేడుకలను ఎంతో ఉత్సాహంగా, ఆనందోత్సవాలతో భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకుంటున్నారు.ప్రతి సంవత్సరం వలె ఈ ఏడాది కూడా శ్రీ వినాయక స్వామి ఉత్సవాలను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. గణనాథుని విగ్రహ ప్రతిష్ఠతో ప్రారంభమైన వేడుకల్లో ప్రత్యేక పూజలు, అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, కోలాట ప్రదర్శనలు మరియు పలు కార్యక్రమాలు నిర్వహించారు.చిన్నారులు, యువత, మహిళలు, గ్రామ పెద్దలు అందరూ ఉత్సవాల్లో భాగస్వాములై వేడుకలకు మరింత శోభను తెచ్చిపెట్టాయి. వినాయక చవితి వేడుకల్లో భాగంగా నిర్వహించిన కోలాట ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామ దేవత అయిన పోలేరమ్మ తల్లి కోలాట బృందం, కూరాకువానిపల్లి గ్రామ కోలాట బృందం తమ అద్భుతమైన ప్రదర్శన గ్రామ ప్రజలను అలరించింది.గ్రామ సంప్రదాయాలను, కళలను కొనసాగించడంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి.ఆ గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా వినాయక స్వామివారి లడ్డూ వేలంపాటను నిర్వహిస్తూ వస్తున్నారు.ఈ ఏడాది కూడా లడ్డు వేలం పాటకు విశేష స్పందన లభించింది.ఈ ఏడాది. వినాయక స్వామివారి లడ్డూను ఆ గ్రామానికి చెందిన గంజికుంట్ల కిరణ్ కుమార్ 61 వేల రూపాయలకు కైవసం చేసుకున్నారు.లడ్డూ 61 వేల రూపాయల ధర పలకడం ఈ ఏడాది ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.లడ్డూను కైవసం చేసుకున్న గంజికుంట్ల కిరణ్ కుమార్ ను గ్రామస్తులు ఉత్సవ కమిటీ సభ్యులు అభినందించారు. వినాయక చవితి వేడుకలకు శ్రీకారం చుట్టిన నిర్వాహకులను, ఎన్నో సంవత్సరాలుగా ఉత్సవాల నిర్వహణలో తమ వంతు సహకారం అందించిన పెద్దలను స్మరించుకుంటూ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.గ్రామ పెద్దల అనుభవం, యువత ఉత్సాహం, చిన్నారుల ఆనందం కలిసినప్పుడే ఇలాంటి వేడుకలు మరింత విజయవంతం అవుతాయని గ్రామస్థులు పేర్కొన్నారు.ఆ సందర్భంగా గ్రామ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలను సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఆ కార్యక్రమాలలో పందనబోయిన ప్రసాద్, యాసం రమణయ్య, పందనబోయిన శ్రీనివాసులు, బాలగురవయ్య, గంగయ్య, రవికుమార్, బాలకృష్ణ, రాగం శ్రీను, మజ్జారి చెన్నయ్య, గంజికుంట్ల కిరణ్ కుమార్,యాసం శ్రీకాంత్, పందనబోయిన వెంకటరమణ, పందనబోయిన గురప్పడు, మజ్జారి చంద్రుడు, తిరుమలకొండు గురవయ్య, కామిశెట్టి శ్రీనివాసులు, తిరుపతయ్య తదితర గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. మూడు రోజుల పాటు జరిగిన పూజా కార్యక్రమాలు, వేడుకల అనంతరం గణనాథున్ని ప్రత్యేక వాహనంపై అలంకరించి మేళ తాళాలతో,బాణసంచా కాల్పులతో యువత కేరింతలతో, రంగులు చల్లుకుంటూ, జై గణేశా నినాదాలతో గ్రామంలో

## గరిమడుగులో కన్నుల పండుగ గణనాథుల శోభాయాత్ర

**– భక్తిశ్రద్ధలతో గణనాథుడి నిమజ్జన శోభాయాత్ర**





**మార్కాపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 19**

మండలం దరిమడుగు గ్రామంలో వినాయక నిమజ్జన శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా గ్రామంలో వివిధ మండపాల్లో కొలువుదీరిన గణనాథులకు ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గణనాథుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ ప్రధాన వీధుల గుండా శోభాయాత్రగా తరలించారు. డప్పుల మోత, భక్తి గీతాల నడుమ యువత, చిన్నారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అనంతరం గణనాథుడిని నిమజ్జనం చేయడంతో వినాయక వేడుక ఘనంగా ముగిసింది.

## రాళ్ళపాడు గ్రామంలో తాగునీటి కష్టాలు





**వలేటివారిపాలెం, పెన్ పవర్ సెప్టెంబర్ 19**

లింగపాలెం పంచాయతీ పరిధిలోని రోళ్ళపాడు గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. గ్రామానికి నీరు సరఫరా చేసే మోటార్ యొక్క స్టాటర్ వారం రోజుల క్రితం కాలిపోయింది. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలో దాదాపు వారం రోజులుగా కుళాయిల్లో నీరు రావడం లేదు. దీంతో గ్రామస్థులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు కిలోమీటర్ల దూరం వెళ్లి బిందెలతో నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పశువులకు కూడా నీరు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. “మోటార్ కాలిపోయిందని పంచాయతీ కార్యదర్శికి, వ చెప్పినా ‘చూస్తాం’ అంటూ కాలయాపన చేస్తున్నారు. తాగడానికి కూడా నీళ్లు లేక అల్లాడుతున్నాం” అని గ్రామస్థులు వాపోతున్నారు. తక్షణమే స్పందించి కొత్త మోటార్ యొక్క స్టాటర్ రిపేర్ చేసి, తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఈవో గిరిరాజు నరసింహబాబుకు సన్మానం

**సి.ఎస్.పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 18**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో నిర్వహించిన వరుణయాగం విజయవంతమై, వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబును శీలంవారిపల్లి గ్రామానికి చెందిన పెన్నం దామోదర్ రెడ్డి, ముడియాల గోపి, పాశం సురేష్, మంకాల నారాయణస్వామి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆలయ ఈఓ గిరిరాజు నరసింహబాబును శాలువాతో సత్కరించి అభినందించారు.ఆలయ ఈఓ గిరిరాజు నరసింహబాబు మాట్లాడుతూ వరుణయాగం విజయవంతం కావడం సంతోషంగా ఉందన్నారు. స్వామివారి కృపతో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.



# సమగ్ర యాజమాన్యంతోనే అధిక దిగుబడులు - ఆత్మ అధికారి కోట రామిరెడ్డి





**సంతమాగులూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 19**

మొక్కజొన్నలో ఫాల్ ఆర్మీవార్మ్‌తో పాటు ఇతర పురుగు, తెగుళ్లను ప్రారంభ దశలోనే గుర్తించి సమగ్ర సస్యరక్షణ పద్ధతులతో నియంత్రించాలని ఆత్మ అధికారి కోట రామిరెడ్డి రైతులకు సూచించారు. నాణ్యమైన విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, సరైన విత్తే సమయం, మొక్కల మధ్య తగిన దూరం, భూసార పరీక్ష ఆధారంగా ఎరువుల వినియోగం, సమతుల్య పోషక యాజమాన్యం, కలుపు నివారణ, నీటి యాజమాన్యంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

**క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష ప్రదర్శన..:** సంతమాగులూరు మండలం ఎల్చూరు, సజ్జాపురం గ్రామాల్లో ఆత్మ పథకం ఆధ్వర్యంలో మొక్కజొన్న, వరి పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులపై ప్రదర్శన క్షేత్రాలను నిర్వహించారు. సమగ్ర యాజమాన్య పద్ధతులకు, రైతులు సాధారణంగా అనుసరించే పద్ధతులకు మధ్య తేడాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా వివరించారు. అవసరమైనప్పుడు మాత్రమే వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన పురుగుమందులను సరైన మోతాదులో వినియోగించాలని రామిరెడ్డి సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు మౌనిక, రామాంజనేయులు, సంబంధిత రైతులతో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అదాలత్

**– ఒంగోలు డివిజన్ విద్యుత్ శాఖ ఈఈ మాకినేని హరిబాబు**



**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ సెప్టెంబర్ 19**

ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్ ) పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ( సిజిఆర్ఎఫ్), విజయవాడ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు, విద్యుత్ సేవలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఒంగోలు డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాకినేని హరిబాబు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 23 వ తేదీ బుధవారం ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు ఒంగోలులోని అన్నవరప్పాడు వద్ద గల డివిజన్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అదాలత్‌కు సిజిఆర్ఎఫ్ విజయవాడ చైర్‌పర్సన్, మాజీ జిల్లా.. సెషన్స్ న్యాయమూర్తి ఎన్. విక్టర్ ఇమ్మానియేల్ అధ్యక్షత వహిస్తారని తెలిపారు. సాంకేతిక సభ్యులు డి. కృష్ణా నాయక్, ఆర్థిక సభ్యులు కృష్ణ, జిల్లా పర్యవేక్షక అధికారి జి. ఆంజనేయులు, స్వతంత్ర సభ్యులు సునీత తో పాటు జిల్లా ఆపరేషన్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు పాల్గొంటారని తెలిపారు. ఒంగోలు డివిజన్ పరిధిలోని ఒంగోలు, కొత్తపట్నం, టంగుటూరు, నాగులుప్పలపాడు, మద్దిపాడు, సంతనూతలపాడు, చీమకుర్తి మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లు, సర్వీస్ నంబర్, సమస్యకు సంబంధించిన అవసరమైన పత్రాలతో హాజరై తమ ఫిర్యాదులు, వినతులను సమర్పించి పరిష్కారం పొందాలని ఈ.ఈ మాకినేని హరిబాబు కోరారు. విద్యుత్ బిల్లింగ్ సమస్యలపై వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# ఏకలవ్య కాలనీలో ఈగల్ కళ్లు..!

**సీఐ అల్తాఫ్ దెబ్బకు నేరస్తుల గుండెల్లో దడ**





**మార్కాపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 19**

మార్కాపురం పట్టణంలో నేర నియంత్రణకు పోలీసులు ఉక్కుపాదం మోపారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ అల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో పట్టణ పోలీసులు, ఈగల్ టీం సంయుక్తంగా ఏకలవ్య కాలనీలో ఆకస్మిక కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారుజామునే కాలనీని చుట్టుముట్టిన పోలీసులు ఇంటింటినీ జల్లెడ పట్టారు. అనుమానాస్పద వ్యక్తులను, నేర చరిత్ర కలిగిన వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. నిషేధిత మత్తు పదార్థాలు, అక్రమంగా నిల్వ ఉంచిన వస్తువుల కోసం పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు.


**సీఐ అల్తాఫ్ హుస్సేన్ పక్కా ప్లాన్..:** ఎస్పీ ఆదేశాలతో సీఐ అల్తాఫ్ హుస్సేన్ ఈ ఆపరేషన్ ను పకడ్బందీగా ప్లాన్ చేసి ఎవరికీ అనుమానం రాకుండా దాడులు నిర్వహించారు. కాలనీలోకి ఎవరూ వెళ్లకుండా, బయటకు రాకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. సీఐ స్వయంగా ప్రతి ఇంటిని తనిఖీ చేస్తూ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు.అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారినైనా వదిలేది లేదని సీఐ అల్తాఫ్ హుస్సేన్ హెచ్చరించారు. మార్కాపురంలో శాంతి భద్రతల పరిరక్షణే తమ లక్ష్యమని, ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. సీఐ దూకుడుతో ఏకలవ్య కాలనీలో అక్రమార్కుల గుండెల్లో వణుకు పుట్టింది. ఈ దాడుల్లో పట్టిన ఎస్.ఐ, ఈగల్ టీం, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మండల పరిషత్ సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా సేవలు

**పదవీ వీడ్కోలు సభలో**

**ఎం పి పి బెల్లం నిర్మలసత్యనారాయణ**





**జరుగుమల్లి, పెన్ పవర్ సెప్టెంబర్ 19**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూటమి ఎన్డీఏ నాయకత్వం లో చేపట్టిన గ్రామీణ అభివృద్ధికి పెద్ద పీట వీధి జరుగుమల్లి మండల పరిషత్ సమగ్ర అభివృద్ధి కి తన వంతు సేవలు అందించామని మండల పరిషత్ అధ్యక్షులు బెల్లం నిర్మల సత్యనారాయణ చివరి సమావేశం లో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి, రామాంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎం పి పి నిర్మలసత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ లక్ష్యం మండలం లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికారుల, ప్రజా ప్రతినిధుల సహకారం తో చేయగలిగానన్నారు. మండల కేంద్రానికి గ్రామాల నుండి లింక్ రోడ్ల నిర్మాణం, పాఠశాలల అభివృద్ధి, తాగునీటి సరఫరా పథకాల అభివృద్ధి వంటి సేవలు చేపట్టడం చేతికి అందిన అవకాశం అన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధికారులు సిబ్బంది ఎం పి పి బెల్లం నిర్మల సత్యనారాయణ దంపతుల ను సత్కరించారు. ఈ కార్యక్రమం లో తాము చేపట్టిన అభివృద్ధికి సహకరించిన మండల తహసీల్దార్ కొండపి వెంకటేశ్వర రావు ని బెల్లం నిర్మల సత్యం దంపతులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో డి ప్యూటీ ఎం పి డి ఒ, కామేశ్వర రావు పరిపాలన అధికారి షేక్ జాఫర్ బాషా,గ్రామ పంచాయతీ సెక్రటరీ లు తదితరులు పాల్గొన్నారు.

## బృందావన్ నగర్ లో వైభవంగా వినాయక చవితి వేడుకలు

**ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ సెప్టెంబర్ 19**

ఒంగోలులోని బృందావన్ నగర్ మూడో లైన్ లో ఉన్న సాయి ఎంక్లేవ్ అపార్ట్మెంట్లో నవరాత్రి వినాయక చవితి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన వినాయకుని విగ్రహానికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫిలిప్స్ ఇండియా లి. జనరల్ మేనేజర్ గాడ్ఫ్రే, మెండా ప్రభాకర్, డాక్టర్ రమణారెడ్డి, భాస్కర్ రెడ్డి బాలాజీ తిరుపతిరావు, రామకోటి ,వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com